Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 156 | హైదరాబాద్ | బుధవారం 29 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

## ఫలితం ఏదైనా బిడ్డలను అక్కున చేర్చుకోండి

### మార్కులు జీవితాన్ని శాసించలేవు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్

నేడు పదో తరగతి ఫలితాలు



(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

బుధవారం పదవ తరగతి ఫలితాలు విడుదలవుతున్న నేపథ్యంలో విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ కీలక విన్నపం చేశారు. ఈ ఫలితాలు విద్యార్థుల జీవిత గమనాన్ని శాసించేవి కావని, సుదీర్ఘ ప్రయాణంలో ఇదొక చిన్న మలుపు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల తర్వాత కొన్ని నిండు ప్రాణాలు అర్ధాంతరంగా గాలిలో కలిసిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, మార్కులు తక్కువ వచ్చాయని లేదా విఫలమయ్యామని ప్రాణాలు తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని, అది ఆయా కుటుంబాలకు తీరని శోకాన్ని మాత్రమే మిగులుస్తుందని హితవు పలికారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్య కేసులను మహిళా భద్రత విభాగం అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేసి, బాధిత తల్లిదండ్రులతో మాట్లాడినప్పుడు కొన్ని దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఓటమి అనేది గెలుపుకు తొలిమెట్టు కావాలే తప్ప, జీవితానికి ముగింపు కాకూడదని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని కోరారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ ఆశలను, అంచనాలను పిల్లలపై భారంగా మోపి వారిని ఒత్తిడికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఫలితం ఏదైనా సరే, పిల్లలను ప్రేమగా అక్కున చేర్చుకోవాలని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని సూచించారు. మార్కుల కంటే పిల్లల ప్రాణం, వారి చిరునవ్వు తల్లిదండ్రులకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఫలితాల వెల్లడి తర్వాత పిల్లల ప్రవర్తనను నిశితంగా గమనించాలని, వారు ఒంటరిగా ఉన్నా లేదా మౌనంగా ఉన్నా వారి వెన్నంటి ఉండి ధైర్యం చెప్పాలని కోరారు. అవసరమైతే పనులన్నీ పక్కన

- మిగతా 2వ పేజీలో



భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆనందంగా పరిహారం తీసుకోవాలని, మనందరం కలిస్తేనే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసిన రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు.

### ప్రపంచ పటంలో

# ఫ్యూచర్ సిటీ

మనందరం కలిస్తేనే ఈ నగరం నిర్మాణం

రైతులు భూములు ఇచ్చి సహకరించాలి


వారిని ప్రభుత్వం ఆదుకుంటుంది

జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించుకుందాం

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌రేట్ నిర్మాణ భూమి పూజలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28: ప్రపంచంలోనే మేటి నగరంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొ న్నారు. ఫ్యూచర్ సిటీ కోసం స్థానిక రైతులు భూములు ఇచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆనందంగా పరిహారం తీసుకోవాలని, మనందరం కలిస్తేనే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసిన రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. అదేవిధంగా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన,

- మిగతా 2వ పేజీలో



### ఉగ్రవాదానికి మద్దతిస్తే

## ఉక్కు పాదం

'ఆపరేషన్ సిందూర్'తో అది నిరూపించాం

భారత్ భాగస్వామ్యాన్ని విస్తరిస్తాం

ఎస్‌సీవో సమావేశంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

బిష్కెక్, ఏప్రిల్ 28: ఉగ్రవాదంపై ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండకూడదని, ఉగ్రవాదులకు మద్దతిచ్చే, ఆశ్రయం కల్పించే దేశాలపై ఎస్‌సీవో (షాంఘై సహకార సంస్థ) కఠిన చర్యలు తీసుకోవాల్సిం దేనని భారత రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం కిర్గిస్థాన్‌లో జరిగిన ఎస్‌సీవో రక్షణ మంత్రుల సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. గతేడాది పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి ప్రస్తావిస్తూ ఈ ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందన్నారు. దీని అనంతరం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి ఉగ్రవా దులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భార త్ నిరూపించిందన్నారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా

- మిగతా 2వ పేజీలో



### ఈశాన్యం ప్రగతికి యాక్ట్ ఈస్ట్, యాక్ట్ ఫాస్ట్

ఈశాన్య రాష్ట్రాలు భారతదేశానికి అష్టలక్ష్ములు

ఎనిమిది రాష్ట్రాల్లో అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

సిక్కిం పర్యటనలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

4,018 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

2లో

# మళ్లీ మహా కరువు

దేశంలో 1876-77 నాటి పరిస్థితులు

మే నుంచే 'సూపర్ ఎల్ నినో'

వాతావరణ మార్పులే కారణం

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో 'ఎల్ నినో' ప్రభావం మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. మే రెండో వారం నుంచే దీని ప్రభావం ప్రారంభమయ్యే అవకాశం ఉందని, జులై నాటికి ఇది మరింత బలపడవచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. 1876-77 కాలంలో సంభవించిన మహా కరువు పరిస్థితులు మళ్లీ తలెత్తుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా వర్షపాతం తగ్గే అవకాశముండగా, పశ్చిమ కనుమల్లో వర్షాలు పడకపోతే కృష్ణా, గోదావరి నదుల్లో నీటి ప్రవాహం గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. దీని ప్రభావం తెలంగాణ సాగునీటి రంగంపై తీవ్రంగా పడే అవకాశముంది. అమెరికాకు చెందిన ఎన్ ఓ ఏ ఏ బ్రిటన్ వాతావరణ శాఖ, యూఎస్ క్లైమేట్ ప్రెడిక్షన్ సెంటర్లు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాయి. మొదట జూన్ రెండో వారం నాటికి ఎల్ నినో



ప్రభావం బలపడుతుందని భావించినా, తాజా పరిస్థితులను పరిశీలిస్తే మే రెండో వారం లేదా జూన్ మొదటి వారానికే ఇది ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జులై నాటికి ఇది మరింత బలపడే అవకాశముందని డబ్ల్యూ ఎం ఓ లోని క్లైమేట్ ప్రెడిక్షన్ చీఫ్ విల్ఫ్రాన్ మౌఫౌమా తెలిపారు. సాధారణంగా పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు

- మిగతా 2వ పేజీలో



## 'రైతు డిక్లరేషన్'తో రైతాంగాన్ని వంచించిన కాంగ్రెస్

**ఆ మోసాన్ని గుర్తు చేసేలా మే 6న వరంగల్‌లో బహిరంగసభ.. వరంగల్ జిల్లా నేతలతో కేటీఆర్**

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగాన్ని అన్నిరకాలుగా మోసం చేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట నాలుగు సంవత్సరాల కిందట అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. పగ్గాలు చేపట్టి రెండున్నరేళ్లు దాటినా ఇప్పటికీ ఒక్క హామీనీ నెరవేర్చకుండా మోసగిస్తోందని ఆరోపించారు. నాలుగేళ్ల కిందట మే 6న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు, చేసిన మోసాలను గుర్తు చేసేలా.. అదే రోజున వచ్చే నెల 6వ తేదీన వరంగల్ జిల్లాలో రైతన్నలతో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో కేటీఆర్‌తో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు సమావేశమయ్యారు. అక్కడ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేటీఆర్‌కు పలు వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల

## రాష్ట్రం అగ్నిగుండం

నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో 46 డిగ్రీలు

8 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు

ఐదు రోజులు ఓ మోస్తరు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 28 : రాష్ట్రం దంచికొడుతున్న ఎండలతో అగ్నిగుండంగా మారుతున్నది. ఉదయం నుంచే ఎండ సుర్రుమంటుడటంతో జనం అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇండ్లనుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో ఎవరూ బయటకు రావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఎనిమిది జిల్లాల్లో 45 డిగ్రీల నుంచి 46 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో

- మిగతా 2వ పేజీలో





## అవినీతిని ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

హిట్లర్‌లా ప్రవర్తిస్తున్న సీఎం

మా ఫోన్లనూ హ్యాక్ చేస్తున్నారు

ఐపీఎస్ అధికారులు రిటైర్ అయినా వదలం

బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

కంది జైలులో బీఆర్ఎస్ కార్యకర్తల పరామర్శ

సంగారెడ్డి, ఏప్రిల్ 28: ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులు, సిట్‌లతో అణచివేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు దుయ్యబట్టారు. సంగారెడ్డి జిల్లా

- మిగతా 2వ పేజీలో

# 'రైతు డిక్లరేషన్'తో రైతాంగాన్ని వంచించిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు వంటి సంస్థాగత అంశాలపై కేటీఆర్ కీలక సూచనలు ఇచ్చారు. త్వరలో జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై కూడా నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల సంఘం చేపట్టబోయే సర్ కార్యక్రమాన్ని అత్యంత ముఖ్యమైన అంశంగా పరిగణించాలని, ప్రతి బూత్‌లో దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో ఎరువులు, విత్తనాల కొరత, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. రైతు ఆత్మహత్యలు కాంగ్రెస్ పాలనలో తిరిగి ప్రారంభమయ్యాయి. కరెంట్ కోతలతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. రైతాంగానికి భారాస పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి.. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలి" అని కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు.

# ఫలితం ఏదైనా బిడ్డలను అక్కున చేర్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టి, ఒక రోజంతా వారితో గడిపి, వారి మనసులోని భయాన్ని పోగొట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు కూడా ఈ సమయంలో విద్యార్థులతో సంభాషించి, ఫెయిల్యూర్ అనేది కేవలం తాత్కాలికమేనని, భవిష్యత్తులో ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఉంటాయని వారికి భరోసా కల్పించాలని పిలుపునిచ్చారు. చదువులో వెనుకబడిన ఎందరో వ్యక్తులు పట్టుదలతో శ్రమించి నేడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్థాయికి చేరుకున్నారన్న నిజాన్ని ఎవరూ మరువవద్దని ఉద్ఘాటించారు. పరీక్షల కంటే ప్రాణం గొప్పదని, ప్రతి విద్యార్థి వెనుక ఒక కుటుంబం ఉందని, వారి కోసం తల్లిదండ్రులు తపిస్తున్నారని ఆలోచించాలని సూచించారు. ఏ చిన్న ఆందోళన కలిగినా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో లేదా ఆత్మీయులతో మనసు విప్పి పంచుకోవాలని, ప్రతికూల ఫలితాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# ఉగ్రవాదానికి మద్దతిస్తే ఉక్కు పాదం

(మొదటి పేజీ తరువాయి)

మారిందని వ్యా ఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండానే ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్ర దాడులను అస్సలు విస్మరించకూడదని హెచ్చరిం చారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం, వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రా ణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూ డా వాటిల్లిందన్నారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉద్రిక్తతల పరిష్కారానికి దౌ త్య మార్గాలను అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కజకిస్తాన్, కిర్గిస్తాన్ రక్షణ మంత్రులతో ముఖ్యమైన ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఆయన కజకిస్తాన్ రక్షణ మంత్రి, లెఫ్టినెంట్ జనరల్ డారెన్ కోసనోవ్తో సమావేశమయ్యారు. పరస్పర గౌరవానికి చిహ్నంగా ఇద్దరు నాయకులు బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. భారత్ స్తాన్‌ల మధ్య పరస్పర సహకారం ఇకపై ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా విభిన్న రంగాలకు విస్తరిస్తామని ఇరుదేశాలు ప్రకటించాయి.

# రాష్ట్రం అగ్నిగుండం

(మొదటి పేజీ తరువాయి)

అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. నిజాబాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో 45.9 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా సత్నాలలో 45.6, కామారెడ్డి జిల్లా బాన్సువాడలో 45.5, సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట్‌లో 45.2, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 45.1, ఆసిఫాబాద్‌లో 45.1, నల్లగొండ జిల్లా అడవిదేవుల పల్లిలో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. బుధ వారం పలు జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని, రానున్న ఐదు రోజులపాటు ఓ మో స్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది.

# అప్రోచ్ రోడ్లను విస్తరించాలి

## చర్లపల్లి రైల్వేస్టేషన్ విస్తరణకు 5 ఎకరాలు కావాలి

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పూర్తిచేయండి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 28 : చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు ఇరు వైపులా అప్రోచ్ రోడ్ల విస్తరణ, పార్కింగ్ తదితర అవసరాల నిమిత్తం అవసరమైన భూమి కేటాయింపు, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం బహిరంగ లేఖ రాశారు. 'హైదరాబాద్‌లో నానాటికీ పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల రాకపోకల మూలంగా నగరంలోని మూడు ప్రధాన రైల్వేస్టేషన్లు కాచిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వేటెర్మినళ్లపై అధిక భారం పడుతున్నది. ఈ సమ స్యకు పరిష్కారంగా నగర పరిధిలోని చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను అభివృద్ధి చేశాం. కొత్త రైల్వే టర్మిన ల్‌ను ప్రారంభించుకున్న తరువాత ప్రతి రోజూ కొన్ని పదుల సంఖ్యలో రైళ్లు చర్లపల్లి నుంచి సేవలు అందిస్తున్నాయి. ఈ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణిస్తున్న ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరి గింది. దీనికి అనుగుణంగా రైల్వేస్టేషన్‌కు వెలుపల ఇరువైపులా ప్రయాణికులు, వాహనాలు రైల్వేస్టేషన్‌కు సులభంగా రాకపోకలు సాగించడానికి వీలుగా అప్రోచ్ రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉంది. అలాగే, పార్కింగ్ తదితర అవసరాల కోసం స్టేషన్‌కు ఇరువైపులా అవసరమైన భూసేకరణ పూర్తి చేయాల్సి ఉన్నది' అని కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

### 200 అడుగుల వెడల్పుతో రోడ్డు

'ఎఫ్‌సీఐ గోడౌన్ రోడ్డు నుంచి కొత్తగా నిర్మించిన స్టేషన్ బిల్డింగ్ వైపు 200 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించాల్సి ఉన్నది. భవిష్యత్తులో ఈ రహదారి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించ డానికి ప్రధాన రహదారిగా మారనున్నది. భరత్‌నగర్ వైపు (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు పక్కగా) నుంచి చర్లపల్లి స్టేషన్‌కు వచ్చే రహదారిని అభివృద్ధి చేయాలి. ఇక్కడ ఇప్పటికే 30 అడుగుల రహదారి ఉన్నది. దీనిని కనీసం 100 అడుగుల వెడల్పుతో విస్తరించాలి. ఈసీ నగర్ నుంచి చర్లపల్లి స్టేషన్‌లోని ఎంఎంటీఎస్ ప్లాట్ ఫాంను చేరుకునే రోడ్డు చాలా ఇరుకుగా ఉన్నది. ఈసీ నగర్ ప్రధాన రహదారి నుంచి స్టేషన్‌ను చేరుకునే ఈ రోడ్డును కనీసం 100 మీటర్ల వెడల్పుతో 700 మీటర్ల పొడవున విస్తరించాల్సిన అవసరం ఉన్నది. వీటితోపాటు చర్లపల్లి స్టేషన్ కొత్త బిల్డింగ్ వైపు 3 ఎకరాలు, ఎంఎంటీఎస్ ప్లాట్ ఫాం వైపు 2.70 ఎకరాల అదనపు భూమిని పార్కింగ్ తదితర అవసరాల నిమిత్తం కేటాయించాల్సి ఉన్నది' అని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. 'చర్లపల్లి టెర్మినల్‌కు నీటి సరఫరా కనెక్షన్‌ను ఏర్పాటు చేయడానికి ఒప్పందం ప్రకారం రూ.4 కోట్ల నిధులను కూడా రైల్వే శాఖ జమచేశాం. ఈ నీటి కనెక్షన్‌ను కూడా త్వరగా ఏర్పాటు చేయాలి. భవిష్యత్ రద్దీని దృష్టిలో పెట్టుకొని రూ.715 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను పునరాభివృద్ధి చేస్తున్నాం.

# ప్రపంచ పటంలో ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

మల్కాజిగిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ పరిపాలనా బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయ భవనాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగారేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడి రైతుల్లో అభ ద్రతా భావం లేకుండా అధికారులు భూ సేకరణ చేపట్టాలని, అభివృద్ధి కోసం భూము లిచ్చే రైతులను అధికారులు గౌరవించాలని సూచించారు. తమ గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీలో కలపాలని కొంతమంది తన వద్దకు వచ్చి విజ్ఞప్తిచేశారని, గ్రామసభ లు నిర్వహించి తీర్మానం చేయించి ఆ గ్రా మాలను వారి కోరిక మేరకు కమిషనరేట్ పరిధిలోకి తీసుకువచ్చేలా చూడాలని స్థానిక నాయకులను ఆదేశించారు. ఇక్కడ భూమిలిచ్చిన రైతులు, మరోచోట భూమి కొనుగో లు చేసేలా డబ్బులు ఇస్తామని తెలిపారు.

### సమస్య పరిష్కారానికి అందుబాటులో శ్రీధర్‌బాబు

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుం టుందని, మీ సమస్య పరిష్కారానికి మంత్రి శ్రీధర్‌బాబు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, పేదల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు సూ చిస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మీరు సహకరిస్తే దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అద్భుత నగర నిర్మాణానికి వేగం గా అడుగులు పడతాయని వెల్లడించారు. ప్రపంచంలో ఏ దేశానికి చెందిన వారైనా ఇక్కడికి వచ్చి పెట్టుబడులు పెట్టేలా ఫ్యూచర్ సిటీని అద్భుత నగరంగా అభివృద్ధి చేసుకుందామని, సింగపూర్, టోక్యో, న్యూయార్క్ లా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. జూన్ 2 లోగా ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభించుకుందామన్నారు. ఇక నుంచి ఇక్కడి నుంచే సమీక్షలు నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానిద్దామని తెలిపారు. నాడు ఔటర్ రింగురోడ్డు నిర్మించేటప్పుడు ఇది అయ్యేది కాదని చాలా మంది అనుకున్నారని, కానీ, 160.500 కిలోమీటర్ల ఔటర్ రింగురోడ్డు దేశంలో ఏ నగరానికీ లేదని చెప్పారు.

### ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలి..

ఫ్యూచర్ సిటీ నిర్మానంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకొని, వారికి ప్రభుత్వ అధికారిక కార్యక్రమం పాస్ పంపించాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంత సుల భం కాదని, అందరూ కలిసి పనిచేస్తేనే సాధ్యమవుతుందన్నారు. ఇది భవిష్యత్ తరాల నగరమని వెల్లడించారు.

### మూడు బుల్లెట్ ట్రైన్లు మన రాష్ట్రానికే..

కేంద్ర ప్రభుత్వం దేశంలో ఏడు బుల్లెట్ ట్రైన్స్ మంజూరు చేస్తే, వాటిలో మూడు మన రాష్ట్రానికే వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. బెంగుళూరు- -హైద రాబాద్, శంషాబాద్- పుణె, శంషాబాద్- అమరావతి-- చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్‌కు మార్గం సుగమమైందన్నారు. రంగారెడ్డి జి ల్లాలో అద్భుతం జరగబోతుందని, అది అందరూ సహకరిస్తేనే ఆవిష్కృతమవుతుందని చెప్పారు. తనపై నమ్మకం ఉంచాలని, సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.

### మిగిలిన వారూ జనజీవన స్రవంతిలో కలవండి..

'ఈ వేదికగా మావోయిస్టులకు పిలుపునిస్తున్నా.. ఇంకా ఎవరైనా మావోయిస్టులు అడవుల్లో మిగిలిపోతే వచ్చి జనజీవన స్రవంతిలో కలవండి.. మీ ఆరోగ్యం, మీకు భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గిరి దర్శక్ కార్యక్రమంలో భాగంగా 20 మంది గిరిజన యువకులకు నియామక పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. పర్యాటక అభివృద్ధితోపాటు గిరిజన యువతకు జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో గిరి దర్శక్ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో గిరిదర్శక్‌ల నియామకం జరిగిందని, ఎంపిక చేసి శిక్షణ అందించిన గిరి దర్శక్‌లు పర్యాటకులకు స్థానిక సంస్కృతి, చరిత్రను వివరిస్తారని తెలిపారు. అటవీ నియమాలు పాటించేలా చూడటంతోపాటు పర్యాటకుల భద్రతను గిరి దర్శక్‌లు కల్పించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### వాళ్ల ఏడుపు నాకు వినసొంపుగా ఉంది..

మేం అభివృద్ధి చేస్తామంటే కొందరు ఏడుపులు మొదలు పెట్టారని, వారు ఏడుస్తూనే ఉండాలని, తా ము అభివృద్ధి చేసుకుంటూ ముం దుకు వెళతామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాక్షసుల కుల గురువు శుక్రా చార్యుడు.. దేవతలు యజ్ఞాలు చేస్తుం టే మారీచుడు, సుబాహుడును పంపి భగ్నం చేయాలని ప్రయత్నించేవారని, అదేవిధంగా రాష్ట్రంలో కూ డా ఫామ్ హౌస్‌లో ఉన్న శుక్రాచార్యు డు మన అభివృద్ధి యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు మారీచుడు, సునాహుడిని పంపాడని, వాళ్లు జనంలో తిరు గుతూ విషం చిమ్ముతున్నారని, వాళ్ల మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశించి విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగానే ఇవాళ ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌కు శంకుస్థాపన చేసుకున్నామని వివరించారు. అధికారం కోల్పోయిన బాధలో వాళ్లు అసూయతో ఏడుస్తుంటే తన చెవులకు అది విన సొం పుగా ఉందని వ్యాఖ్యానించారు.

# మళ్లీ మహా కరువు

(మొదటి పేజీ తరువాయి)

0.5 నుంచి 1 డిగ్రీల వరకు పెరిగితే నార్మల్ ఎల్ నినోగా పరిగణిస్తారు. 1 నుంచి 2 డిగ్రీల మధ్య ఉంటే మోస్తరు ఎల్ నినో, 2 డిగ్రీలకు మించి పెరిగితే 'సూపర్ ఎల్ నినో'గా గుర్తిస్తారు. ప్రస్తుతం మార్చి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ఎన్ ఓ ఏ ఏ వెల్లడించింది. ఇప్పటికే 0.6 డిగ్రీల పెరుగుదల నమోదైందని తెలిపింది. ఇండోనేషియా, సౌత్ ఈస్ట్ ఏషియా ప్రాంతాల్లో ఇప్పటికే ప్రభావం కనిపిస్తోంది. మేఘాల ఏర్పాటుకు ఆటంకం కలిగించే ఔట్‌గోయింగ్ లాంగ్‌వేవ్ రేడియేషన్ పెరగడంతో వర్షాలు తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి క్రమంగా మరింత బలపడుతోంది.

### కరువు కాటకాల ముప్పు

సూపర్ ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉంటే కరువు పరిస్థితులు మరింత విషమించవచ్చు. 1876–77లో సంభవించిన మహా కరువులో ప్రపంచ వ్యాప్తంగా 2 కోట్ల నుంచి 5 కోట్ల మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. అది ప్రపంచ జనాభాలో దాదాపు 4 శాతం. భారతదేశంలోనే సుమారు 96 లక్షల మంది మృతి చెందారు. ఆ సమయంలో బాంబే, మైసూరు, మద్రాస్, హైదరాబాద్ ప్రాంతాల్లో వర్షాభావం తీవ్రంగా ఉండటంతో పంటలు విఫలమయ్యాయి. ఈ కరువును 'మద్రాస్ ఫెమైన్'గా పిలిచేవారు. లక్షలాది మంది రైతులు, కార్మికులు జీవనోపాధి కోసం వలసలు వెళ్లాల్సి వచ్చింది.

### తెలంగాణపై ప్రభావం ఎంత?

తెలంగాణలో కూడా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపించే అవకాశముంది. సాధారణంగా 92% వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈసారి 5% వరకు లోటు ఉండవచ్చని అంచనా. మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాభావం ఉంటే పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గి కృష్ణా, గోదావరి నదులకు వరదలు తగ్గే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులు నిండక సాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన వర్షపాతం లోటు, తూర్పు జిల్లాల్లో మధ్యస్థ లోటు ఉండవచ్చని అంచనా. దక్షిణ జిల్లాలపై ప్రభావం తక్కువగా ఉండొచ్చని అధికారు లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాతావరణ శాఖ అధికారులు క్లోజ్ మానిటరింగ్ కొనసాగి స్తున్నారు. ఎల్‌నినో ముందుగానే ప్రభావం చూపితే రాష్ట్రంపై దాని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# అవినీతిని ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

(మొదటి పేజీ తరువాయి)



కందిలోని సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌తో పాటు మరో ఏడుగురు కార్యకర్తలను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేక్ పోస్టులు పెట్టిన వారిని వదిలేసి, ఆధారాలతో ఫిర్యాదు చేసిన క్రిశాంక్ ను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపేనని విమర్శించారు. కొంతమంది ఐపీఎస్ ఆఫీసర్లు బెంగళూరు ప్రైవేట్ హ్యాకర్లను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చోబెట్టి మా ఫోన్లు, ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. చట్ట విరుద్ధంగా పనిచేస్తున్న ఐపీఎస్ ఆఫీసర్లను.. రేపు రిటైర్ అయినా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని విచారణ జరిపిస్తామ న్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తుంటే రేవంత్‌రెడ్డి వంద కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడంలో బిజీగా ఉన్నారన్నారు. సన్నవడ్లకు బోనస్ ఇస్తారో లేదో సీఎం తేల్చాలి.. ఐదారు కిలోల తరుగు తీస్తున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి హిట్లర్ పాలన సాగిస్తున్నాడని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ లో కూర్చుని నేనే రాజు, నేనే మంత్రి అనుకుంటున్నావు. మీ అరాచకాలను గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదన్నట్టు ఎంసీఆర్హెచ్‌ఆర్డీలో వంద కోట్లతో కొత్త ప్యాలెస్ కట్టుకుంటున్నాడని తెలిపారు. రైతులు 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల దగ్గర పడిగాపులు కాస్తుంటే శనగలు, సన్ ఫ్లవర్ కొనే నాథుడే లేదని వాపోయారు.యాసంగి సన్నవడ్లకు బోనస్ ఇస్తావా? ఇవ్వవా? స్పష్టం చేయాలన్నారు. క్రిశాంక్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, మళ్లీ పీటీ వారెంట్లు వేసి ఇబ్బంది పెట్టాలని చూస్తే మాత్రం చూస్తూ ఊరుకోమని హరీశ్‌రావు హెచ్చరించారు.

# ఈశాన్యం ప్రగతికి యాక్ట్ ఈస్ట్, యాక్ట్ ఫాస్ట్

## ఈశాన్య రాష్ట్రాలు భారతదేశానికి అష్టలక్ష్ములు

## 8 రాష్ట్రాల్లో అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## సిక్కిం పర్యటనలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

## 4,018కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు

గాంగ్‌టక్: ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలు భారతదేశానికి అష్టలక్ష్ములు అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈశాన్య ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వ విధానం కేవలం 'యాక్ట్ ఈస్ట్'మాత్రమే కాదని.. 'యాక్ట్ ఫాస్ట్'కూడా అని స్పష్టంచేశారు. ఈశాన్య రాష్ట్రాలను శరవేగంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రధాని మోదీ మంగళవారం ఈశాన్య రాష్ట్రమైన సిక్కింలో పర్యటించారు. రాజధాని గాంగ్‌టక్‌లో నిర్వహించిన సిక్కిం రాష్ట్రావతరణ 50వ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలు, అనుసంధానం, ఆరోగ్య సంరక్షణ, విద్య, పట్టణాభివృద్ధి, విద్యుత్, పర్యావరణం, పర్యాటకం, వ్యవసాయ రంగాలకు సంబంధించి రూ.4,018 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు స్వర్ణజయంతి మైత్రి మంజరి పార్కులో ఆర్కిడ్ పుష్పాల తోటను సందర్శించారు.

### ఈశాన్యానికి స్వర్గం సిక్కిం

సిక్కిం ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగమే ప్రధాన ఆధారమని ప్రధానమంత్రి చెప్పారు. రాష్ట్రంలో అనుసంధానాన్ని మెరుగుపరచడంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని, దీనివల్ల పర్యాటకుల రాక మరింత పెరుగుతుందని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా నుంచి ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించడం, పర్యాటకుల రాకపోకలను పెంచడానికి గాంగ్‌టక్‌లో రింగ్ రోడ్ నిర్మించడం సహా సిక్కింలో మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టంచేశారు. రాష్ట్ర ఆవతరణ ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మోదీ 35 నిమిషాలపాటు ప్రసంగించారు. రాష్ట్రానికి రోప్‌వే, స్కైవే ప్రాజెక్టులు రానున్నాయని, నాథులాలో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించనున్నట్లు తెలిపారు. సిక్కింలో ప్రకృతి, సంస్కృతి సజీవంగా కనిపిస్తాయని అన్నారు. ఇక్కడి రహదారుల పరిశు భ్రత, గాలి స్వచ్ఛత చూస్తే సిక్కిం ప్రజలు ప్రకృతి పరిరక్షణకు నిజమైన ప్రతినిధులు అని తెలుస్తోందంటూ ప్రశంసించారు. సేంద్రియ వ్యవసాయం వంటి కార్యక్రమాల ద్వారా సిక్కిం సహా ఈశాన్య ప్రాంతం భవిష్యత్ వృద్ధికి, సుస్థిరాభివృద్ధికి కేంద్రంగా మారనుందని వెల్లడించారు. సిక్కిం రాష్ట్రం శాంతి, ఆధ్యాత్మికత, శ్రేయస్సులకు నిలయమని కొనియాడారు. హిమాలయ రాష్ట్రాన్ని సందర్శించాలంటూ పర్యాటకులకు పిలుపునిచ్చారు. సహజసిద్ధమైన అందాలు వీక్షించాలని, ఆర్కిడ్ తోటల్లో విహరించాలని సూచించారు. ఇక్కడ పర్యావరణ అనుకూల పర్యాటక రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. దాదాపు 1,000 హోమ్‌స్టేలను నిర్మిస్తున్నారని, సాహసపర్యాటక రంగానికి మౌలిక సదుపాయాల పరంగాకూడా ఊతం లభిస్తోందని వివరించారు. ఈ రాష్ట్రం 'ఏక్ భారత్, శ్రేష్ట భారత్'స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని చెప్పారు. ఈశాన్యానికి స్వర్గం సిక్కిం అని ఉద్ఘాటించారు.

### ఫుట్‌బాల్ ఆడిన మోదీ

ప్రధాని మోదీ గాంగ్‌టక్‌లో విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సాకర్ సెషన్ చాలా ఉత్తేజపర్చేలా ఉందని అభివరి?ణంచారు. గాంగ్‌టక్‌లో ఈ అందమైన ఉదయం వేళ యువ మిత్రులతో కలిసి ఫుట్‌బాల్ ఆడటం గొప్ప అనుభూతిని ఇచ్చిందని స్పష్టంచేశారు. తనతోపాటు ఫుట్‌బాల్ ఆడిన విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి మోదీ ఫోటో దిగారు. సిక్కింలో క్రీడా మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి, ముఖ్యంగా ఫుట్‌బాల్, ఆర్చరీ రంగాల్లో క్రీడాకారులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని తెలిపారు.

# ఓడరేవులపై దిగ్బంధాన్ని ఎత్తేయండి

## హోర్ముజ్ జలసంధిని తెరుస్తాం

## అమెరికాకు ఇరాన్ ప్రతిపాదన

టెహ్రాన్, ఏప్రిల్ 28: తమదేశంలోని ఓడరేవులపై అమెరికా దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే, యుద్ధానికి ముగింపు పలికితే హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు తాము సిద్ధమని ఇరా న్ మధ్య వర్తిత్వం ద్వారా అమెరికాకు నూతన ప్రతిపాదన చేసినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. అణు కార్యక్రమంపై మాత్రం తరువాత చర్చిద్దామని ప్రతిపాదించారు. అబ్బాస్ అరాగ్చీ పాకిస్థాన్ పర్యటన తరువాత ఈ పరిణామం చోటు చే సుకుంది. ప్రతిపాదన అందుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జాతీయ భద్రత, విదేశాం గ విధాన బృందంతో సిచ్యుయేషన్ రూమ్ సమావేశం నిర్వహించనున్నారని, అయితే ఇరాన్ ప్రతిపాదనకు అంగీకరించే అవకాశం లేదని తెలుస్తుంది. యురేనియం శుద్ధి ప్రక్రియను నిలిపివేయడానికి ఇరాన్‌ను ఒప్పించ డం, శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తొ లగించడం ఇప్పుడు ట్రంప్ యుద్ధ లక్ష్యాలని పేర్కొంది. కీలకమైన హెర్ముజ్ జలసంధిని అటు అమెరికా, ఇటు ఇరాన్ దిగ్బంధించడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభ పరిస్థితులు తలెత్తాయి. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు, ఆ దేశ ఆయిల్ ఎగుమతులను అడ్డుకునేందుకు హెర్ముజ్‌ను అమెరికా దిగ్బంధించింది. ఎగుమతులు నిలిచిపోవడంతో అయిల్‌ను నిల్వ చేసేందుకు చోటు లేక ఇరాన్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. హెర్ముజ్ దిగ్బంధంతో అమెరికాపైనా ఒత్తిడి పెరుగుతున్నది. చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రపంచదేశాలు తీవ్ర సంక్షో భంలో చిక్కుకున్నాయి. ఇంధనం, ఎరువులు, ఆహార ధరలు భారీగా పెరిగాయి. అ మెరికాతో ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ చమురు పైప్‌లైన్లు పేల్చేస్తామని అ ధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ ధీటుగా స్పందించింది.



# అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 28**

అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు అందించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల రెండు పడక గదుల ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కనిపించే ఉద్దేశంతో చేపట్టిన రెండు పడక గదుల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మన కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి కార్యాలయ రికార్డులు, దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## హైదరాబాదులో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో విజేతలుగా వేములవాడ విద్యార్థుల ప్రతిభ

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 28:**

హైదరాబాద్ నగరంలో నిర్వహించిన సీకే ఇంటర్ క్లబ్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో వేములవాడకు చెందిన జీవన్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పలు విభాగాలలో మెడల్స్ సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ విషయాన్ని అకాడమీ ప్రధాన కోచ్ సుజీవన్ తెలియజేశారు. ఈ పోటీలలో రాష్ట్రం నలుమూలల నుండి పలువురు ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొనగా, జీవన్ తైక్వాండో అకాడమీకి చెందిన విద్యార్థులు తమ క్రమశిక్షణ, పట్టుదల మరియు కఠినమైన సాధనతో అద్భుత విజయాలను నమోదు చేశారు. విజేతలుగా, బాలికల విభాగంలో కాపిల్ల సహస్రన్విత -- గోల్డ్ మెడల్, బాలుర విభాగంలో 18 కిలోల విభాగంలో పిట్టల శ్రీయాన్ష్ -- సిల్వర్ మెడల్, అండర్-14 విభాగంలో పిట్టల నిఖిల్ - బ్రాంజ్ మెడల్, అపురి సిరాజ్ -- బ్రాంజ్ మెడల్, అండర్ 59 కిలోల విభాగంలో ఎలకుర్తి చైతన్య -- సిల్వర్ మెడల్, 52 కిలోల విభాగంలో వజ్రాల ప్రవీణ్ -- బ్రాంజ్ మెడల్,అండర్ 48 కిలోల విభాగంలో ముప్పిడి కేశవ్ పటేల్ -- బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ విజయాలపై కోచ్ సుజీవన్ మాట్లాడుతూ, "మా విద్యార్థులు నిరంతర సాధన, క్రమశిక్షణతో ఈ స్థాయికి చేరుకున్నారు. వారి కృషి ఫలితంగా ఈ విజయం సాధ్యమైంది. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలో రాణించేందుకు మేము మరింత శిక్షణ అందిస్తాము" అని తెలిపారు. అలాగే, ఈ విజేతలకు తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు మరియు వేములవాడ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ విజయాలు వేములవాడ ప్రాంతానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. జీవన్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ఈ పోటీలలో సాధించిన విజయాలు ఇతర యువతకు ప్రేరణగా నిలుస్తాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడ్డాయి.



## మాజీ శాసనసభ్యులు గడ్డి గారి విఠల్ రెడ్డినీ మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్లి గ్రామస్తులు

**(కపిల్ సీఆర్ కే, ప్రజాతీర్పు భైంసా) ఏప్రిల్ 28**

నర్సాపూర్ జి మండలంలోని అర్లి గ్రామంలో మక్కా కొనుగోలు కేంద్రం ఏర్పాటు కు కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. మక్కా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినందుకు మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి గౌరవనీయులు శ్రీ జూపల్లి కృష్ణారావుగారికి మరియు వ్యవసాయ శాఖ మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారికి మరియు మాజీ శాసనసభ్యులు గడ్డి గారి విఠల్ రెడ్డి, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గ్రామంలోని పలు సమస్యల గురించి విన్నవించడం జరిగింది సమస్యల పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తానని మాజీ శాసనసభ్యులు జి.విఠల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మురళి విడిసి మెంబెర్ లు సతీష్, విష్ణు, నిలు,మధుకర్ సతీష్, సాయిమరియు తదితరులు ఉన్నారు.

## మంత్రి అడ్లూరి స్వీయ గణన.. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆన్ లైన్ లో వివరాల నమోదు

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 28**



దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణన 2027లో భాగంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్ లైన్ లో వివరాల నమోదు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు జనగణన చేస్తున్న విషయం తెలిసిందే.. జనగణలో భాగంగా సంక్షేమ శాఖ మంత్రి జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివరాలను ఆన్లైన్ లో నమోదు చేశారు. ప్రభుత్వం చేపట్టిన జనగణనకు ప్రతి ఒక్కరు సహకరించి వివరాలను నమోదు చేయాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# గింజ కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తాం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ఎమ్మెల్యే విజయరమణారావు

**పెద్దపల్లి ప్రతినిధి ,ఏప్రిల్ 28 (ప్రజా తీర్పు):**



పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులు పండించిన ప్రతి గింజను కటింగ్ లేకుండా కొనుగోలు చేస్తామని తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడు, కూరమపల్లి, అందుగులపల్లి, దేవునిపల్లి, రంగాపూర్, గౌరెడ్డిపేట, ముత్తారం, హన్మంతునిపేట, చీకురాయి గ్రామాలతో పాటు సుల్తానాబాద్ మండలం కట్నపల్లిలో సింగిల్ విండో, హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం రంగాపూర్ గ్రామంలో 30 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కటింగుల పేరిట రైతుల ధాన్యాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. రైతు సమస్యల విషయంలో తాను ఎప్పుడూ రాజీ పడబోనని స్పష్టం చేశారు. నియోజకవర్గ రైతులు తనపై ఉంచిన విశ్వాసం మరింత బాధ్యతను పెంచిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైస్మిల్లర్ల నుంచి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతు భరోసాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, విడతల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు. కొనుగోలు పూర్తయిన ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు వరి పంటపైనే ఆధారపడకుండా పంటల మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరుగుతుందని చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, సింగిల్ విండో అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండ వడదెబ్బ కు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) ఏప్రిల్ 28**



మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ జిల్లాలో ఎండ తీవ్రతలు పెరుగుతున్నందున వడదెబ్బపై తీసుకోవలసిన జాగ్రత్తలు వాటి పైన అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు మంచిర్యాల జిల్లా కలెక్టర్, కార్యాలయంలో మహిళా సాధికరత మరియు టీనేజ్ బాలికల ఆరోగ్యము పైన అవగాహన కోసం వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు మహిళలు పిల్లలు మరియు మున్సిపల్ సిబ్బందికి వడదెబ్బ పైన అవగాహన కలిగించడం జరిగినది ముఖ్యంగా వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత వేడి గాలుల కారణంగా వడదెబ్బ డిహైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకం కావచ్చు కావున ప్రజలందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం పూటనే తమ కార్యక్రమంలో చేసుకోవాలి మండువేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో తిరగరాదు మద్యము సేవించరాదు రోడ్లమీద లభించే చల్లని రంగు పానీయాలు త్రాగరాదు రోడ్లమీద అమ్మి కలుషిత ఆహారం తినరాదు మాంసాహారం తగ్గించి తాజా కూరగాయల్ని ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి ఇంటిలో చుట్టుపక్కల శుభ్రత పాటించి దోమలు లేకుండా చేసుకోవాలి రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి ద్రవపదార్థాలు తీసుకోవాలి పరిశుభ్రతకు అత్యధిక ప్రాథమిక ఇవ్వాలి. ఎల్లవేళ లా ఇంటి వద్దనే ఉండండి బయటకు వెళ్లవలసి వస్తే టోపీ లేదా గొడుగు తీసుకుని వెళ్లాలి అత్యవసర పరిస్థితులలో మడ దెబ్బ తగిలిన వ్యక్తికి చల్లని ప్రదేశానికి తీసుకుని చేర్చాలి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరం తుడవాలి ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోస్ ద్రావణం లేదా ఓఆర్ఎస్ త్రాగించాలి మన దెబ్బ తగిలి అపస్మాస్థితిలో రోగికి నీరు త్రాగించకూడదు వీలైనంత తొందరగా 108 అంబులెన్స్ ద్వారా రోగిని తరలించాలి కావున ప్రజలందరూ ముఖ్యంగా గర్భవతులు బాలింతలు అసంక్రమణ వ్యాధులతో ఉన్న డయాబెటిస్ రోగులు క్యాన్సర్ రోగులు వృద్దులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి పిల్లలను బయట ఆడనివ్వదు. స్కూల్ లకు సెలవులు ఉన్నందున పిల్లలు బయట ఆడుకొనడము చేయడం జరుగుతుంది తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరడమైనది మన ఆరోగ్యము మన చేతిలోనే ఉంది మనము కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ వడదెబ్బను నివారించవచ్చును కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పోస్టర్లు కరపత్రాల ద్వారా అవగాహన కలిగించడం జరిగింది



## అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**మంథని, ఏప్రిల్28 (ప్రజాతీర్పు)**

మంథని మండలం గుమ్మునూర్ రెండవ కేంద్రంలో మంగళవారం. పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ కళావతి ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ ప్రజలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే ఆకట్టుకున్నాయి. అంగన్వాడి కేంద్రంలో ప్రీ-స్కూల్ విద్యను పూర్తిచేసుకున్న చిన్నారులకు గుర్తింపుగా కార్యక్రమం నిర్వహించి, వారికి ప్రోత్సాహం కల్పించారు. అలాగే గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన ఆహారం, పోషకాహార ప్రాముఖ్యత, తల్లి-శిశు ఆరోగ్యం కోసం పాటించాల్సిన సూచనలను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా గ్రామ మహిళల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాళ్లు సుంకరి మాధవి, బందెల సునిత, ఆశవర్కర్ బందెల హేమలత పాల్గొన్నారు.



## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**(వై యాదగిరి ప్రజాతీర్పు, మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.28**

మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం కేంద్రంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన.. సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయించిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు సంతోష, పెంజల సంతోష, బక్కని శాంతమ్మ, కాసాని వినోద, ఆముదాలపల్లి బాలమణి, రేలా అరుణ, గుర్రంపల్లి పుష్పమ్మ, ఎర్ర యాదమ్మ, చెక్కులను పంపిణీ చెయ్యడం జరిగింది ఈకార్యక్రమంలో.. ఎంపీడీవో శైలజ రెడ్డి, ఎమ్మార్వో, అప్పలనాయుడు,ఎండిఓ, కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ వీఆర్వో రాజేందర్ మరియ మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులో పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో దేవాలయాల అభివృద్ధి కి పెద్దపీట

### ధర్మపురి పట్టణానికి మాస్టర్ ప్లాన్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 28.**



జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహ పుణ్యక్షేత్రం దర్శించుకున్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కార్మిక ఽ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు( ఐఏఎస్), జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ (ఐఏఎస్ )తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్దులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందరి సహకారంతో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని మాస్టర్ ప్లాన్ అమల్లోకి తీసుకురావాలి అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం కార్మిక ఽ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, దేవాదాయ శాఖ వైదిక సలహాదారు గోవిందుల హరి తో కలిసి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాలను, మాడ వీధులను, కోనేరు మరియు దేవస్థానం ఆవరణాలను, మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ (ప్రా) ద్వార చేయవలసిన పనులు అలాగే నిర్ధారించిన లక్ష్యాలు అమలు పరిచాల్సిన పనులకు దిశ నిర్దేశం చేశారు. 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు నిర్ణయించారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఆలయాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంలోని భాగంగా గోదావరి తీరం వెంట ఉన్న పలు ఆలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారని వివరించారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులకు ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు తోపాటు పలువురు అధికారులు కలిసి మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని ఈ సందర్భంగా వివరించారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రజల నుంచి సహకారం కావాలని కోరారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలతో పాటు టెంపుల్ సిటీ నిర్మాణ పనులు చేస్తామని వివరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకు వెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంను టెంపుల్ సిటీగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, శ్రీ లక్ష్మీనరసింహ టెంపుల్ ఈవో, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఎంపీడీవో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మందుబాబులకు అడ్డాగా తిలక్ గ్రౌండ్




**(వి.వెంకటేష్, ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఏప్రిల్ 28**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం, తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బెల్లంపల్లి నాయకులు విజ్ఞప్తి తిలక్ గ్రౌండ్ మైదానంలో మందు బాబులకు అడ్డాగా మారింది సాయంత్రం 8గంటల సమయంలో విచ్చలవిడిగా గ్రౌండ్ మైదానంలో తాగుతూ బీరు సీసాలు పగలగొడుతూన్నారు, ఉదయం వాకర్స్ వాకింగ్ కి వచ్చేసరికి పగిలిన గాజు ముక్కలు, ఖాళీ బీర్ సీసాలు, స్టఫ్ పేపర్లు, చిప్స్ ప్యాకెట్ ర్యాపర్లు చెత్త చెదారం తో ఉంటున్నాయి. వాకర్స్ వాకింగ్, చేయలేకపోతున్నారు దయచేసి పోలీస్ శాఖ వారికి విజ్ఞప్తి చేస్తున్నాము దయచేసి ఇటువంటి పనులు జరగకుండా చూడగలరని వినమ్రతతో కోరుతున్నాము. అలాగే బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కి పలుదపాలుగా కలిసి లిఖిత పూరకంగా పలు సమస్యలు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదు వందలాది మంది ఉదయాన సాయంత్రం గ్రౌండ్ కు వస్తుంటారు సీనియర్ సిటిజన్స్ మహిళలు పిల్లలు వందలాది మంది వస్తుంటారు విపరీతమైన దుమ్ము లేస్తుంది వాటర్ స్ప్రే చేయాలని మున్సిపల్ చైర్మన్ కి దృష్టి కూడా తీసుకెళ్లడం జరిగింది దయచేసి వర్షాలు పడేంతవరకు రోజు వాటర్ స్ప్రే చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రంగ రామన్న ప్రధాన కార్యదర్శి కంటెవాడ నాగేష్ కుమార్ కోరడమైనది



## దేగాంలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

**(కపిల్ వాగ్మారే, ప్రజాతీర్పు సి ఆర్ కె బైంసా) ఏప్రిల్ 28**

నిర్మల్ జిల్లా బైంసా మండలంలోని దేగాం గ్రామంలో అంబేద్కర్ గారి 135 వ జయంతి ఉత్సవాలు. అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది.అందులో భాగంగా ముందుగా గ్రామ సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి,బుద్ధుడు మరియు అంబేద్కర్ చిత్రపటానికి, పూల మాలలు వేసి పంచరంగి జెండాను ఆవిష్కరించడం జరిగింది. తరువాత ఆమె మాట్లాడుతూ,అంబేద్కర్ కాలనీలోని లుంబిని బుద్ధ విహార్ లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమాల ఉత్సవాల వేడుకల్లో సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి, మాట్లాడుతూ,అంబేద్కర్ భవన నిర్మాణానికి, స్థానిక ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ గారితో మాట్లాడి 20 లక్షల రూపాయలతో నిధులతో,నూతన భవనాన్ని నిర్మించడానికి, మరియు బుద్ధవనం స్పెషల్ ప్రాజెక్టు కింద బుద్ధుడు మందిర నిర్మాణానికి కూడ నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో నలందా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కపిల్ వాగ్మారే,వార్డ్ మెంబర్ పాతర్ల నరేష్, నాగేష్, చోటు, మాజీ వార్డ్ మెంబర్ హైదర్, హిందు వాహిని శాఖ గ్రామ అధ్యక్షులు నరేష్, వీడిసి సభ్యులు లక్ష్మణ్,మెంబర్ సుప్రియ సిద్ధోధన్, జై భీమ్ సేనా యూత్ అధ్యక్షులు గంగాధర్, ఎమ్మెస్ ఎఫ్ జిల్లా నాయకులు రాచర్ల ప్రవీణ్, అజయ్, గద్పాలె కార్తీక్, మహిళలు మరియు రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## గత ప్రభుత్వాలు ఆలయాన్ని పట్టించుకోలేదు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

### అందరి సహకారంతో ధర్మపురి క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలు

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 28**

గత ప్రభుత్వాల కాలంలో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాన్ని పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, దేవాదాయ శాఖ వైదిక సలహాదారు గోవిందుల హరితో కలిసి మంత్రి ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, క్షేత్ర మాస్టర్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. ఇందులో భాగంగా గోదావరి తీరంలోని పలు ప్రముఖ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. భద్రాచలంశ్రీసీతారామచంద్రస్వామి ఆలయం మాస్టర్ ప్లాన్, టెంపుల్ సిటీ పనులను ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రారంభించారని మంత్రి పేర్కొన్నారు. అలాగే బాసర సరస్వతి అమ్మవారు, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాలతో పాటు ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధర్మపురి ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ అమలు, టెంపుల్ సిటీ నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు పరిశీలనలు చేపట్టి, త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారని తెలిపారు. అలాగే ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని మంత్రి కోరారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో మాస్టర్ ప్లాన్ అమలు చేసి, టెంపుల్ సిటీ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు.



## అపర భద్రాదిలో ఆగ్రహ జ్వాలలు

### దేవస్థాన నిర్లక్ష్యంపై రోడ్డెక్కిన హనుమాన్ భక్తులు!

**జమ్మికుంట ఏప్రిల్ 28 (ప్రజాతీర్పు)**

హుజురాబాద్ నియోజకవర్గం ఇల్లందకుంట మండలం లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇల్లంతకుంట అపర భద్రాదిగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అధికారుల నిర్లక్ష్యంపై హనుమాన్ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. ఇల్లందకుంట చౌరస్తాలో భక్తులు నిరసన చేపట్టి, ఆలయ నిర్వహణలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. భక్తులకు కనీస సౌకర్యాలు కూడా అందించడం లేదని, త్రాగునీటి వంటి ప్రాథమిక అవసరాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో అనవసరంగా అధిక బిల్లులు చూపిస్తూ భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆలయంలో జరుగుతున్న అక్రమాలపై వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని భక్తులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో భక్తులు నిరసనను విరమించారు.



## కరాటేలో డ్రాగన్ షోటోకాన్ విద్యార్థుల గిన్నిస్ రికార్డు

**గోదావరిఖని ఏప్రిల్ 28 ( ప్రజా తీర్పు):**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు.కరాటే మాస్టర్ పసునూటి చందు మాట్లాడుతూ పోటీల్లో సుమారు రెండు వేల మందికి పైగా విద్యార్థులు, మాస్టర్లు పాల్గొన్నారని తెలిపారు. కాటా విభాగంలో ఏకధాటిగా 40 సార్లు కాటా ప్రదర్శన ఇవ్వడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదు అయినట్లు చెప్పారు.క్లబ్‌కు చెందిన సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో టింగు జయసాయి చరణ్, సహస్ర, ఆయన్ష్, కృతిక్, సాయి రోషన్, స్పందన, అనన్య, ఎం.డి జైన్, సర్వీన్ రెడ్డి, లాస్యప్రియా, ప్రణీత్, రోనీత్ కుమార్, లక్ష్మీప్రియా, రిషిత, అక్షయ్, అభిషేక్, సాత్విక్ నందన్, రజినీకాంత్ భవాని, వాసికర్, శ్రీ హర్షిత్, నేత్ర, శ్రీ వికసిని, స్మితేష్, శ్రీ హరిషిని, భార్గవరామ, అశ్విత్ రెడ్డి, శైలేందర్, దీపిక దుర్గ, సాత్విక్, శ్రీనందన్, శ్రీ సిద్ధ్విక్, అధ్య, శాన్వి శ్రీ, అక్షిత తదితరులు ఈ రికార్డు సాధనలో పాల్గొన్నారు.రికార్డు సాధించిన విద్యార్థులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తల్లిదండ్రులు అభినందించారు.

## సింగిల్ విండో చైర్మన్ లుగా నామినేటెడ్ నియామకాల యోచన అప్రజాస్వామికం

- ఓటమి భయంతోనే నామినేట్ ఆలోచనలో కాంగ్రెస్ సర్కార్
- వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్

**(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఏప్రిల్ 28**



తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ( ఫ్యాక్స్ ) ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిలో కాకుండా, నామినేటెడ్ పదవులతో కార్యవర్గాన్ని నియమించాలనే ప్రభుత్వ యోచన అప్రజాస్వామికమని జగిత్యాల జిల్లా వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పతిపాక వెంకటేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ కార్యకర్తలకు అప్పనంగా ఫ్యాక్స్ చైర్మన్ పదవులు నామినేటెడ్ పద్ధతిలో కట్టబెట్టే ప్రయత్నం కాంగ్రెస్ సర్కార్ చేస్తుందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ప్రభుత్వం వెంటనే ఈ యోచన విరమించుకోవాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. ఫ్యాక్స్ ఎన్నికలు నిర్వహిస్తే ఓటమి తప్పదనే భయంతోనే ప్రభుత్వం దొడ్డి దారిన నామినేటెడ్ పద్ధతిలో కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు కట్టబెట్టాలని చూస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో మూడుసార్లు రైతు భరోసా అమలు చేయకుండా రైతులను నిరాశపరిచిందని, రైతు బీమా పథకాన్ని అటకెక్కించడంతో వేలాది క్లెయిమ్ లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. అంతేకాకుండా యూరియా సరఫరాలో సైతం ప్రభుత్వం విఫలమైందని, యాప్ ద్వారా యూరియా పంపిణీతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్న తూకం వేయడంలో జాప్యం చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాలకు ఇంతవరకు రైస్ మిల్ ల అలాట్మెంట్ జరగలేదని వాపోయారు.మాది రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ కు రైతులు ఓట్లు వేసే సహకార సంఘాల ఎన్నికలంటే భయం ఎందుకని..? ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి సింగిల్ విండో చైర్మన్ లకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.





## తబితా ఆశ్రమంలో చైల్డ్ సేఫ్టీపై అవగాహన

### డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : పోలీస్ కమిషనర్

**పెద్దపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 28 ( ప్రజాతీర్పు):**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండంలోని తబితా ఆశ్రమంలో 'చైల్డ్ సేఫ్టీ -- డ్రగ్స్‌కు నో చెప్పండి' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలను వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసిక ప్రభావాలు, భవిష్యత్‌పై పడే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధి కోసం ఆశ్రమంలోని పిల్లలకు క్రీడా సామగ్రి, స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని ప్రోత్సహించారు.కార్యక్రమంలో ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్, పోలీసు సిబ్బంది, ఆశ్రమం నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానను సందర్శించిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్

**ఖానాపూర్ ఏప్రిల్ 28 ( ప్రజా తీర్పు ప్రతినిధి)**



నిర్మల్ జిల్లా లోని ఖానాపూర్ పట్టణం గాంధీనగర్ కాలనీలోని బస్తీ దవాఖానను సందర్శించిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితి బాగాలేక ఆసుపత్రికి వచ్చే ప్రజలకు వృద్ధులకు మంచి వైద్యంతో పాటు నాణ్యమైన మందులను అందజేయాలని వైద్యులను కోరారు .దవాఖానకు వచ్చిన ప్రజలు కాలనీవాసులతో వారు మాట్లాడుతూ వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్ నాయకులు గొర్రె గంగాధర్ ,సల్ల రవీందర్ రెడ్డి , బాత్తుల లక్ష్మి నారాయణ, నరపాక నర్సయ్య, కత్తెర పాక రాజేశ్వర్ కుందురి ఉషాన్న, గోవర్ధన్, సుదం రామరాజు,కాలనీ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

## అతడు సింగం అయితే నేను పుష్ప!

### ఈసీ నియమించిన ఐపీఎస్‌కు తృణమూల్ అభ్యర్థి కౌంటర్

పశ్చిమ బెంగాల్‌లో బుధవారం రెండో, ఆఖరి విడత ఎన్నికలు జరుగనున్న క్రమంలో ఫాల్టా నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల సంఘం పరిశీలకునిగా నియమించిన ఐపీఎస్ అధికారి పాల్ శర్మకు వ్యతిరేకంగా 24 పరగణాల జిల్లాలో మంగళవారం తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులు నిరసన వ్యక్తం చేశారు. ఫాల్టాలో టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ నివాసం, ఎన్నికల కార్యాలయం బయట పోలీస్ అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జహంగీర్ ఖాన్ అనుచరులు కొందరు ప్రజల నుంచి ఓటర్ ఐడెంటిటీ కార్డులు సేకరిస్తున్నారని వచ్చిన ఆరోపణల మేరకు విధి నిర్వహణలో సింగంగా పేరున్న శర్మ అంతకుముందు అక్కడ పర్యటించి, ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి చర్యనైనా అడ్డుకుంటామని జహంగీర్ ఖాన్‌ను ఉద్దేశించి హెచ్చరించారు.

# విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు

- లింగ సమానత్వం, సైబర్ భద్రతపై విద్యార్థులకు చైతన్యం

**గోదావరిఖని ఏప్రిల్ 28 ( ప్రజాతీర్పు):**





ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం పలు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏహెచ్‌టీయూ ఎస్ఐ శైలజ ఆధ్వర్యంలో సెంట్ క్లేర్స్ హైస్కూల్ (ఎన్‌టీపీసీ), శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ (గోదావరిఖని), కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల (సీసీసీ, నస్పూర్), ఏకలవ్య ఆశ్రమం--సేవా భారతీ (మంచిర్యాల)లో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా విద్యార్థులకు లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, పిల్లల భద్రత, పితృస్వామ్య భావజాలం, మహిళలపై ద్వేష భావాలు, లింగ వివక్ష, జెండర్ బైయాస్, హింస, సైబర్ నేరాలు, సైబర్ బులీయింగ్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.అదేవిధంగా షీ టీమ్స్ సేవలు, మహిళలు--పిల్లలు ఎదుర్కొనే సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సంప్రదించాలని సూచించారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. యువతలో భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# మల్కాజ్‌గిరిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు మల్కాజిగిరి ప్రతినిధి) ఏప్రిల్ 28**



మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం మౌలాలి, నేరేడ్‌మెట్, యాప్రాల్ ప్రాంతాల్లో సుమారు రూ. 2.62 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ మరియు జలమండలి అధికారులతో పాటు స్థానిక కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన మల్లన్న జాతర, రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులు:**

సంతోష్ మాత కమాన్ -- డి.ఏ.వి స్కూల్ రోడ్ వద్ద రూ. 40 లక్షలతో సీసీ రోడ్డు. మౌలాలి షఫీ నగర్‌లో రూ. 32 లక్షలతో సీసీ రోడ్డు. మౌలాలి షాదుల్లా నగర్ ఈద్గా వద్ద రూ. 15 లక్షలతో టూల్ రూమ్ ఒ సీసీ రోడ్డు. మౌలాలి షఫీ నగర్ బస్తీలో రూ. 32 లక్షలతో సీసీ రోడ్డు కాకతీయ నగర్ శ్రియ హాస్పిటల్ సమీపంలో రూ. 36.5 లక్షలతో భూగర్భ డ్రైనేజీ. నేరేడ్‌మెట్ బృందావన్ కాలనీలో రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు. ఆర్కే పురం, నేరేడ్‌మెట్‌లో రూ. 17.5 లక్షలతో సీసీ రోడ్డు. డిఫెన్స్ కాలనీ, నేరేడ్‌మెట్‌లో రూ. 38 లక్షలతో సీసీ రోడ్డు. పటేల్ ఎన్‌క్లేవ్ రామకృష్ణ స్కూల్ సమీపంలో రూ. 19.48 లక్షలతో భూగర్భ డ్రైనేజీ. శిరిడీ ఎన్‌క్లేవ్‌లో రూ. 6.6 లక్షలతో భూగర్భ డ్రైనేజీ. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ డి.ఈ. సుదర్శన్, జలమండలి డీజీఎం విద్యాసాగర్, రమణ, వర్క్ ఇన్స్పెక్టర్లు నరేందర్, దేవేందర్, శ్రీకాంత్, అలాగే బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమంతరావు, జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, మురుగేష్, చిన్న యాదవ్, లక్ష్మణ్ యాదవ్, శోభ, శివ గౌడ్, సాయి గౌడ్, వంశీ ముదిరాజ్, ఉస్మాన్ ఇబ్రహీం, మారుతి ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, సుమన్ గౌడ్, తులసి సురేష్, హేమంత్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాలనీల ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మల్కాజ్‌గిరి అభివృద్ధి పథంలో ముందుకు... ప్రజల సంక్షేమమే లక్ష్యం ఎమ్మెల్యే మర్రి.



# అంబేద్కర్ అడుగుజాడల్లో బోసి బహుజన నాయకులు

**(కపిల్ సీ ఆర్ కె, ప్రజాతీర్పు బైంసా) ఏప్రిల్ 28**

నిర్మల్ జిల్లా తానూరు మండలం బోసి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కంబ్లే మధు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం.ఒక గొప్ప వరమని ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఈరోజు భౌతికంగా లేకున్నా ఏప్పటికీ, ప్రజల గుండెల్లో ఉంటారని అడుగు బలహీన వర్గాలకు అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసి కుల వివక్ష ఎదుర్కొని, తాను పడుతున్న కుల వ్యవస్థ లో జరుగుతున్న అన్యాయాలను , ఎదుర్కొని ఆ రోజుల్లోనే, బ్రిటిష్ ప్రభుత్వంతో,భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొని, రాజ్యాంగ రూపశిల్పిగా,ఉన్నత చదువులు చదివి నిరంతరం శ్రమించి ప్రజల కోసమే తన ప్రాణాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన ఈరోజు భారతదేశంలో బడుగు బలహీన వర్గాలు రిజర్వేషన్లు పొందుతున్నారు అంటే అది ఆయన చలువే అని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని కొనియాడారు. ఉపాధ్యక్షులు లోకండేశేషరావు, సభ్యులు సండే సాయినాథ్,దండే సుధాకర్,కంబ్లే జైపాల్,కంబ్లే సిద్ధార్థ,లోకండేసాయినాథ్, లోకండేభుజంగరావు,దండే నాగేష్,కంబ్లే సరోజన ,కంబ్లే జ్యోతి, దండే స్వప్న, లోకోండి మీనా, గ్రామ సర్పంచ్ పసుల సాగర నాగనాథ్, సెక్రటరీ మహేష్,దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలను విజయవంతం చేయాలి

## కరపత్రాలను ఆవిష్కరించిన ఏఐటీయూసీ నాయకులు

**గోదావరిఖని ఏప్రిల్ 28 ( ప్రజాతీర్పు):**

తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర రెండో మహాసభలను జూన్‌లో నిర్వహించనున్నట్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ పిలుపునిచ్చారు.మంగళవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌తో కలిసి మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.అనంతరం మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయిస్తున్నాయని విమర్శించారు. జూన్ 12 నుంచి పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, అయితే కార్మికుల వేతనాలను మాత్రం రూ.3 వేలకే పరిమితం చేస్తున్నట్లు ఆరోపించారు. వేతనాల పెంపుపై ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలో ఇచ్చిన సమ్మె పిలుపును రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసి, జూన్ 12 నుంచి సమ్మెకు సిద్ధంగా ఉండాలని మధ్యాహ్న భోజన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్, రామగుండం మండల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఓదెల రమేశ్, నాయకులు బి. రజిత, ఎండి సహానా, కత్తెర మల్లసరిత, లావణ్య, ఫాతిమా, అజీర పాల్గొన్నారు.



# జాబితాపూర్ ధర్మారంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 28**

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి అన్నారు. జాబితాపూర్ ధర్మారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జాబితాపూర్,ధర్మారం,గ్రామాల్లో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను నారాయణ రెడ్డి, సర్పంచులు, ఫోన్ శెట్టి మహేష్, పరమల సుమలత మల్లేష్ రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామాల్లోనే దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తుందన్నారు. రైతులకు పంట పెట్టుబడి సహాయంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం కంటే పెంచి రైతు భరోసా ఇస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. జగిత్యాల నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నిధులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని వివరించారు. నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకువస్తూ గ్రామాల్లో రోడ్లు,బిల్డింగులు,ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేస్తున్నారని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు ఫోన్ శెట్టి మహేష్, పరమల సుమలత మల్లేష్, ఉపసర్పంచ్ లు డీకొండ ప్రేమ్నాథ్, మారుశెట్టి లక్ష్మణ్,మాజీ సర్పంచు అంకం మమత సతీష్, కార్యదర్శులు తిరుపతి రంజిత్ కుమార్,ఏపీఎం రాజయ్య, సీసీ గంగారం ఐకెపి నిర్వహకులు జయలక్ష్మి, ప్రమోద్, వార్డు సభ్యులు నవీన, శెట్టి లక్ష్మి రవి, రవీందర్, కళ్యాణి జలంధర్ గౌడ్, సంధ్య రాజు, మోటూరి సతీష్, సట్టా నరసయ్య, ముత్తునూరి రాయమల్లు, రాజుల గంగారం, బండారి సంజీవ్, కందుల లాస్య శేఖర్ గౌడ్, కొరెపు రాజ్ కుమార్, మేఘన, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన--ప్రగతి పాలనలో స్నేహ నర్సింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు

## జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి ప్రొటెక్షన్ ఆఫీసర్ విద్యాసాగర్

**(మదు,ప్రజాతీర్పు సూర్యాపేట) ఏప్రిల్ /28**

సూర్యాపేట జిల్లా కోదాడలో మహిళా శిశు సంక్షేమశాఖ మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో స్నేహ నర్సింగ్ కాలేజీలో చదువుతున్న నర్సింగ్ విద్యార్థినుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి ప్రొటెక్షన్ ఆఫీసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఆడపిల్లలు ఫోన్ వినియోగం ద్వారా ఎదుర్కొనే సమస్యలు,విద్య దశలో అనుసరించవలసిన సరైన పద్ధతులు,మంచి అలవాట్లు మరియు చెడు అలవాట్ల వల్ల కలిగే ప్రభావాలపై సమగ్రంగా వివరించారు.అలాగే ప్రొటెక్షన్ ఆఫీసర్ మీరా మాట్లాడుతూ పిల్లల ప్రవర్తన, కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత,విద్య భవిష్యత్తుకు పునాది అనే అంశాలను వివరించారు.చెడు స్నేహాల వల్ల కలిగే నష్టాలు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు మరియు స్నేహితుల పట్ల ఎలా ప్రవర్తించాలో సూచనలు ఇచ్చారు.అదనంగా సైబర్ నేరాలు, పోస్కో చట్టం మరియు బాలల రక్షణ సేవలపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్నేహ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్,అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఘనంగా పొనుగోటి వివాహ వార్షికోత్సవ వేడుకలు

## కేక్ కట్ చేసిన యాదవ మహిళా విభాగం అధ్యక్షురాలు కల్పన యాదవ్

**(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఏప్రిల్ 28:**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి వెల్గటూర్ మండలం మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు- మంజుల దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు అఖిల భారత యాదవ మహాసభ మహిళా విభాగం ఎండపల్లి మండల అధ్యక్షురాలు ఏదుల కల్పన యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కల్పన యాదవ్ మాట్లాడుతూ పొనుగోటి శ్రీనివాసరావు ( బాపు) ఉమ్మడి వెల్గటూర్ మండలంలో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక భావనతో దేవాలయాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారని, పేదరికంతో బాధపడుతున్న అనేక మందికి ఆర్థిక సాయం అందజేసిన దైవ సంభూతులు పొనుగోటి మంజుల - శ్రీనివాసరావు దంపతులని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మహిళలు ముక్కెర స్వాతి, కంబల్ల అర్చన, మాచర్ల వైష్ణవి లతోపాటు విద్యార్థిని లు పసుపులేటి వైష్ణవి,కొత్తపెల్లి సాత్విక, బొంగాని సుధీష్ణ, గన్నేరువరం శిరీష, గన్నేరువరం లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



# మాసాయిపేటలో బాలల రక్షణ, హక్కులు


**( వంజరపు ఎల్లం, ప్రజాతీర్పు మాసాయిపేట్ ) ఏప్రిల్ 28**

మాసాయిపేట మండల కేంద్రంలో మంగళవారం ఉదయం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల్లో భాగంగా ఎమ్మార్వో జ్ఞాన జ్యోతి ఆధ్వర్యంలో బాలికల చైల్డ్ ప్రొటెక్షన్ చట్టాలపై చైల్డ్ మ్యారేజ్ వచ్చే నష్టాలను అవగాహన కల్పించారు యాంటీ డ్రగ్స్ యువత తన భవిష్యత్తును డ్రగ్స్ తీసుకొని ఆరోగ్యం మరియు మానసికంగా నష్టపోతున్నారని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన సదస్సు నిర్వహించి, భారీ ర్యాలీతో, గ్రామ కచేరు వద్ద ప్రతిజ్ఞ చేయించి వాటి వల్ల వచ్చే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జ్ఞాన జ్యోతి, ఎంపీడీవో విగ్నేశ్వర్, ఎంఈఓ మధుసూదన్ రావు, చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, సెక్రటరీ రాణి, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జనగణలో బీసీ కుల కుల గణన చేయాలి

## తెలంగాణా బీసీ హక్కులఉద్యమ నేత సుంకేట పోశేట్టి

**(కపిల్ సి ఆర్ కె, ప్రజా తీర్పు బైంసా) ఏప్రిల్ 28**



ఇటీవల కేంద్ర ప్రభుత్వం జనగణన, చేపట్టడానికి, స్వాగతిస్తున్నాం. అందులో బీసీ కుల గణన కూడ చేపట్టాలని, తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకేట పో శెట్టి అన్నారు. ఇజనగణన ద్వారా బీసీల లెక్కలు తెలుస్తాయని, ఇ లెక్కల ప్రకారం బీసీల జనాభా ఎంతో ఇటు రాష్ట్ర ప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వనికి బీసీ లజనాభాను తెలుస్తుంది. కావున ఇ సమాచారంద్వార, బీసీలకు చట్ట సభలో, ఎస్ సి ఎస్ టి, లకు ఏవిధంగా రిజర్వేషన్లను, అమలు జరుగుతున్నాయో,అదే విధానాన్ని బీసీలకు కూడా అమలు జరిగే అవకాశం ఉంది.కాబట్టి జనఘనలో బీసీ కుల గణన చేయాలని, లేని ఎడల బీసీ మేధావులతో కలిసి భవిషత్తు ఉద్యమాలు చేస్తామని,సుంకేట పోశెట్టి డిమాండ్ చేశారు.

# దాడికి పాల్పడ్డ వ్యక్తిని శిక్షించాలి...

**జమ్మికుంట, ఏప్రిల్ 28 (ప్రజాతీర్పు)**



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో దాడికి పాల్పడ్డ వ్యక్తిని శిక్షించాలని నిరసిస్తూ మంగళవారం నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజిరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్పొరేటర్ భర్త మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పై దాడి చేయడం జరిగిందని నిరసన తెలుపడం జరిగిందన్నారు. దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మున్సిపల్ ఉద్యోగులకు కనీస భద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శ్రీనివాస్, వార్డ్ ఆఫీసర్లు పలువులు పాల్గొన్నారు.

# పుష్కరాల పనులు వేగవంతం చేయాలి..

- రహదారుల నిర్మాణం కోసం కేంద్ర మంత్రులను కలుస్తాం..
- ధర్మపురిలో పుష్కరాల పనులపై సమీక్ష నిర్వహించిన మంత్రి అడ్లూరి..

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్ 28**



గోదావరి పుష్కరాల పనులతో పాటు ధర్మపురి క్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు, ఆలయ అభివృద్ధిపై అధికారులతో మంగళవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు వివిధ శాఖల అధికారులతో ధర్మపురిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని అన్నారు. అధికారులు ఇప్పటికే తయారుచేసిన ప్రణాళికలు మరో మారు పున సమీక్షించి ఎక్కడ ఇలాంటి ఇబ్బందులు రాకుండ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పుష్కరాలు కావాల్సిన నిధుల కోసం త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తానని మంత్రి తెలిపారు. ధర్మపురి మండలం రాయపట్నం నుండి ధర్మపురి వరకు ఉన్న నేషనల్ హైవే 63 అభివృద్ధి పనుల నిధుల కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్గరిని కలిసి నిధులు సమకూర్చాలని కోరుతామని మంత్రి అన్నారు. ధర్మపురి క్షేత్రం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు ఉన్న ఇబ్బందులను స్థానికులతో చర్చించి భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే విధంగా స్థానిక నేతలు చోరవ తీసుకోవాలని మంత్రి సూచించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు టేకులపల్లి) ఏప్రిల్ 28**




మండలం బొమ్మనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తున్నారా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయోగిస్తున్న మాయిశ్చరైజింగ్ యంత్రం పనితీరును కలెక్టర్ పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి లోపాలు లేకుండా, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ విధానం, కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ, టోకెన్ పంపిణీ వ్యవస్థపై సమగ్ర సమాచారం సేకరించారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా చూడాలని, ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని, ప్రతి నమోదు ఖచ్చితంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి రైతు లాభపడేలా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. తనిఖీలో తాసిల్దార్ వీరభద్రం సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోండి..

**జమ్మికుంట ఏప్రిల్ 28 (ప్రజాతీర్పు)**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో రైల్వే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు రైల్వే గేట్ మూసివేయడానికి తీర్మానం సమర్పించగా.. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్, పాలకవర్గం ఆమోదించారు. మంగళవారం మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ భారతీయ రైల్వే సాధారణ నియమాలను అనుసరించి లెవెల్ క్రాసింగ్ లను తొలగించి రద్దీ నియాత్రణ చేయు లక్ష్యంతో సౌత్ సెంట్రల్ రైల్వే జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మడిపల్లి క్రాస్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంను చేయుటకు గేటు మూసివేయడానికి కౌన్సిల్ సభ్యులు ముందు తీర్మాణం సమర్పించగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేసిన పిదప మాత్రమే రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటును మూసివేయుటకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించిన్నట్లు చైర్మెన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇట్టి ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలు సెంట్రల్ రైల్వే జోన్ ఖాజీపేట వారికి డిపీఆర్, ఇతర వివరాలు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ అభివృధి మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వాణీలతో పాటు పలువురు పాల్గొన్నారు.



## మేడే వేడుకలకు సన్నాహాలు

### కార్మిక సంఘాల నేతలకు అవగాహన కార్యక్రమం

**పెద్దపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 28 ,(ప్రజాతీర్పు):**

మేడే ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల యూనియన్ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలు, కార్మిక చట్టాల అమలు, భద్రతా చర్యలపై అధికారుల ద్వారా వివరించారు. పెద్దపల్లి, గోదావరిఖని, మంథని ప్రాంతాలకు చెందిన కార్మిక శాఖ అధికారులు, దళిత బహుజన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బొంకూరి కైలాసం, వివిధ యూనియన్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు చేరేలా యూనియన్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. మేడే ఉత్సవాలను విజయవంతం చేయడంలో కార్మిక సంఘాల నాయకులు ముందుండాలని పిలుపునిచ్చారు.




## బోడుప్పల్లో " ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక " కార్యక్రమం

**బోడుప్పల్, ఏప్రిల్ 28 (ప్రజాతీర్పు)**

మేడ్చల్ మల్కాజ్గిరి బోడుప్పల్ సర్కిల్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా 54 వ రోజు బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ ఆదేశానుసారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పర్వతాపూర్, సత్యనారాయణపురం కాలనీలలో డాగ్ క్యాచింగ్, స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు బోడుప్పల్ ఏ ఎం ఓ హెచ్ డాక్టర్ చైతన్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని సత్యనారాయణపురం కాలనీలో గల వీధి కుక్కలను వెటర్నరీ డిపార్ట్మెంట్ సహకారంతో పట్టుకొని స్టెరిలైజేషన్ కొరకు పంపించడం జరిగింది. పట్టుకున్న వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించడం జరిగింది. పట్టణ పరిధిలోని వివిధ కాలనీలో వీధి కుక్క లకు త్రాగునీటి తొట్టెలను ఏర్పాటు చేయడం జరిగిందని, స్థానిక ప్రజలు వీధి కుక్కలను దత్తత తీసుకొని వాటికి ఆహారం మరియు తాగునీటిని అందించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో ఏ ఎమ్ ఓ హెచ్ డాక్టర్ చైతన్య కుమార్ తో పాటు వెటర్నరీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన

**రామడుగు, ఏప్రిల్28 (ప్రజాతీర్పు ప్రతినిధి)**




రామడుగు మండలం వెదిర గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యతపై సమగ్రంగా వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల శారీరక, మానసిక వికాసం మెరుగవుతుందని సూచించారు. అదే విధంగా బాల్యవివాహాల దుష్పరిణామాలను వివరించి, విద్యను కొనసాగించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులను సులభంగా నమ్మకూడదని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే 1098, 181, 100 వంటి హెల్ప్‌లైన్ నంబర్లకు సంప్రదించాలని అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, ఇంట్లో వండిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై కూడా బాలికలకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రేణుక, అంగన్వాడీ టీచర్లు సునీత, భాగ్యరాణి, గౌతమి, శ్వేత పాల్గొన్నారు.



## వరి కొనుగోలు వేగవంతం చేయండి

- మహిళలు వడ్డీలేని రుణాలు సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామీణ అభివృద్ధి అధికారి మచ్చ గీత

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 28**

ఈరోజు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మచ్చ గీత ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కందికట్కూర్ వంతడుపుల ముస్కాన్ పేట కొనుగోలు కేంద్రాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు వేగవంతంగా చేయాలన్నారు కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు సమకూర్చాలన్నారు రైతుల వివరాలను వెంటవెంటనే ఆన్లైన్లో నమోదు చేస్తూ డబ్బులు పొందేలా చూడాలన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో వివో ఏలు మరియు వివో అధ్యక్షురాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పొదుపులు పెంచుకోవడంతో పాటు ఆదాయ మార్గాలను పెంచుకోవడానికి తగిన ప్రణాళికలు రూపొందించుకోవడంతో పాటు ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సభ్యులు ఏర్పాటు చేసుకున్న మినరల్ వాటర్ ప్లాంట్, చెప్పుల దుకాణం, లేడీస్ ఎంపోరియం లాంటి ఎంటర్ప్రైజెస్ సంతృప్తి వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఏపీఎం చెన్నబోయిన కుమారస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సౌమ్య, కార్యదర్శి సరస్వతి, సీసీలు రామచంద్రారెడ్డి, వెంకటేశం, రామచంద్రం, విట్టల్ రెడ్డి, రాజేశ్వరి, వివో ఏలు కమిటీ సభ్యులు రైతులు హమాలీలు పాల్గొన్నారు.




## పెట్రోల్ డీజిల్ కృత్రిమ కొరతను నివారించాలి

### సిపిఐ ఎంఎల్. న్యూ డెమోక్రసీ

**(పొనకంటి ఉపేందర్ రావు, ప్రజాతీర్పు,టేకులపల్లి) ఏప్రిల్ 28**

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరతతో రైతాంగం. వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పెట్రోలు డీజిల్ కృత్రిమ కొరతను డీలర్లు సృష్టిస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని ఇట్టి ప్రచా రంపై నిజ నిజాలనునిగ్గుతెల్సిజిల్లాయంత్రాంగం కొరత లేకుండా పెట్రోల్ డీజిల్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ .న్యూ డెమోక్రసీ .టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో భారత్ బంకు వద్ద నిరసనను వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు.ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి ప్రసాద్ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం పెట్రోల్ డీజిల్ పై లీటర్ కు 30 రూపాయలు పెంచుతున్నట్లు అందువల్లనే డీలర్లే కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రసారం జరుగుతుందని ఇట్టి ప్రచారంపై అధికారి అంతరాంగం స్పష్టత ఇచ్చి కొరత లేకుండా పెట్రోల్ డీజిల్ను సరఫరా చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని వారు అన్నారు రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరకలేదని సరిపడా ఉందని అధికారులు చెబుతున్నారని కానీ బంకులు నోస్టాకు బోర్డులతో దర్శనమిస్తున్నాయని వారు అన్నారు ఇప్పటికైనా అధికార యంత్రాంగం పెట్రోల్ బంకుల వద్ద నో స్టాకు బోర్డు లేకుండా చర్యలు తీసుకొని పెట్రోల్ డీజిల్ సరిపడ సరఫరా చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హర్జ ఎట్టి నరసింహారావు గుగులోతు రామచంద్ భానోతు వెంకటరాము .కొడెం రవి .బోడ మంగీలాల్ . ఆంబోతు బాలు. తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ గా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొ. కోదండరాం వారికి ఆత్మీయ సన్మానం చేసిన గజెల్లి వెంకటయ్య

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల ప్రతినిధి) ఏప్రిల్ 28**



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కోటా లో ఎమ్మెల్సీ గా నియమితుడైన తెలంగాణ పొలిటికల్ జె ఏ సి చైర్మెన్ , తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ . కోదండరాం వారిచే శనాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సోమవారం రోజున ఎమ్మెల్సీ గా ప్రమాణ స్వీకారం చేయించిన సందర్భంగా మంచిర్యాల జిల్లా తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక మరియు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య ఎమ్మెల్సీ కోదండరాం వారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేసి శాలువాతో ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోలిటికల్ ఆచార్య కోదండరాం నాయకత్వంలో సబ్బండ వర్గాలు చేసిన వీరోచిత పోరాటాల ఫలితంగా 1200 మంది అమర వీరుల ఆత్మ బలిదానాల వల్లనే సీమాంధ్రుల దోపిడీ వలస పాలన అంతమై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని అన్నారు. ప్రొ . కోదండరాం వారికి ఎమ్మెల్సీ గా అవకాశం కలిపించిన రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ రేవంత్ రెడ్డి వారికి తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక మరియు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం పక్షాన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర వహించిన ఎమ్మెల్సీ కోదండరాం వారికి రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని ముఖ్య మంత్రి వారికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు ఎన్నో పోరాటాలు చేసి జైల్ల పాలై అన్ని రకాలుగా నష్టపోయిన తెలంగాణ ఉద్యమ కారులను , అమర వీరుల కుటుంబాలను గతంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకోకపోవడం మూలననే బీఆర్ఎ స్ ప్రభుత్వాన్ని ఉద్యమ కారులు , నిరుద్యోగులు ఇంటి దారి పట్టించినారని పేర్కొనరు. 2023 ఎన్నికల కన్నా ముందు తెలంగాణ ఉద్యమ కారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరిచే విధంగా కృషి చేయాలని ఎం ఎల్సీ కోదండరాం వారిని తెలంగాణా ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య ఈ సందర్భంగా కోరడం జరిగింది. అమరవీరులకు ఉద్యమ కారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలీ .

# ఎమ్మెల్యే బంధువు భూముల కోసమే బైపాస్ రోడ్డు

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపణ

**మంథని, ఏప్రిల్ 28 (ప్రజాతీర్పు)**




మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ తన బంధువు భూములకు విలువ పెంచి రియల్ ఎస్టేట్‌కు అనుకూలంగా మార్చేందుకే శ్రీపాద బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం మంథని పట్టణంలోని అంగుళూరు శివారులో ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రాంతం, పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ రోడ్డు నిర్మాణం వల్ల మంథని ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, ఇది పూర్తిగా వృథా ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. బైపాస్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల క్రితమే జీఓ వచ్చినప్పటికీ ఇప్పటి వరకు భూసేకరణకు నిధులు విడుదల కాలేదని తెలిపారు. ఈ ప్రాజెక్టు కారణంగా 80 ఎకరాల భూమి, 137 మంది రైతు కుటుంబాలు ప్రభావితమై రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతుల్లో అధిక సంఖ్యలో బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారని వివరించారు. ఎమ్మెల్యే కు ఓట్లు వేసింది కాపులు సహా ఇతర సామాజిక వర్గాల ప్రజలేనని, అయినప్పటికీ కాపుల భూములు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఈ రోడ్డు ప్రతిపాదన తెచ్చినట్లుగా కనిపిస్తోందన్నారు. ప్రజలకు అవసరం లేని ఈ రోడ్డు కేవలం ఎమ్మెల్యే బంధువు భూముల కోసమే వేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పునరాలోచన చేసి రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తాను ఈ ప్రాంత మట్టిలో పుట్టి పెరిగానని, రైతుల కష్టాలు తెలుసునని, కానీ ఎమ్మెల్యేకు ఈ ప్రాంతంతో సంబంధం లేకపోవడంతో రైతుల బాధలు అర్థం కావడం లేదన్నారు. బంధువుకు సహాయం చేయాలనుకుంటే పరిశ్రమలు లేదా ఐటీ రంగంలో చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. మంథని, అంగుళూరు, విలోచవరం గ్రామ శివారుల రైతులే ఎక్కువగా నష్టపోతారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే బంధువుల భూముల కోసమే ప్రాజెక్టును ఆలస్యం చేస్తున్నారని, ఇందులో ల్యాండ్ మాఫియా కూడా ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల భూములకు నాలా కన్వర్షన్ చేస్తున్న అధికారులు స్థానిక రైతుల భూములకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఈ ప్రాంతంలో రెండు పంటలు పండుతున్నాయని, సరైన పరిస్థితులు ఉంటే మూడు పంటలు కూడా పండించే అవకాశం ఉందన్నారు. పచ్చని పంట పొలాలు, హైవేకు సమీపంలో ఉన్న ఈ భూములకు మంచి డిమాండ్ ఉండగా అవసరం లేని రోడ్డు కోసం భూములను తీసుకోవడం సరికాదన్నారు. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే కరకట్టల కారణంగా నీరు నిలిచి పంటలు మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆరెంద మల్లారం వద్ద గతంలో ఇలాంటి పరిస్థితుల వల్ల నాలుగేళ్లుగా పంటలు నీట మునిగిపోతున్నాయని గుర్తు చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా అవసరమైతే బోయిన్‌పేట, గొల్లగూడెం మీదుగా రింగ్ రోడ్డు నిర్మించాలని, తక్షణమే బైపాస్ రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు.

# వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

## జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట ఏప్రిల్ 28 (ప్రజా తీర్పు ప్రతినిధి ):**



మిరుదొడ్డి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ, తొగుట మండలం బండారు పల్లి గ్రామంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మీరుదొడ్డి మార్కెట్ కమిటీలో పొద్దుదిరుగుడు కొనుగోలు చెయ్యాలని స్థానిక రైతులు కోరగా పొద్దుదిరుగుడు కొనుగోలు రాష్ట్ర స్థాయి అధికారులను ఇదివరకే సంప్రదింపులు జరిపినట్లు వారి అనుమతి రాగానే వెంటనే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో 419 ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు టెంట్, కుండలో తాగునీరు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్స్, టార్పాలిన్ కవర్లు, సుతిల్ దారాలు, గన్ని బ్యాగులు ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తేమ శాతం వచ్చే వరకు రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్దనే అరబెట్టుకోవాలని, తప్పనిసరిగా తాలు తీసిన వరి ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఇట్టి విషయాన్ని గమనించాలని తెలిపారు. అక్కడక్కడ కొన్ని కేంద్రాల్లో తాలు తియ్యకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వస్తున్న సమాచారం అవాస్తవం అని తెలిపారు. తాలు తీసాకే ధాన్యానికి గ్రేడ్ ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.



# వేసవికాలంలో మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రజలు అవస్థలు.. పట్టించుకోని అధికారులు

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.28**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో గత నెల రోజుల నుండి మిషన్ భగీరథ వాటర్ సమస్యలు తీవ్రంగా మొదలయ్యాయి.. ఒక్కరోజు వాటర్ వదిలితే నాలుగు లేదా ఐదు రోజుల వరకు వాటర్ రావడం లేదు అని ప్రజలు వాపోతున్నారు.. అసలు కారణాలు మిషన్ భగీరథ వాటర్ ఎందుకు రావడం లేదని విషయంపై అధికారులు స్పష్టంగా చెప్పకపోవడంతో.. ప్రజలు నీళ్ల సమస్యతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు ఇప్పటికైనా.. వాటర్ ఎందుకు రావడం లేదో స్పష్టమైన సమాచారం ప్రజలకు అందజేయవలసిన అవసరం అధికారులకు ఉందని తెలియజేస్తూ గ్రామంలో వాటర్ సమస్య లేకుండా చూడాలని అధికారులకు గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేయడం జరుగుతుంది.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.28**

మహేశ్వరం నియోజకవర్గం, బాలాపూర్ మండల్, మామిడిపల్లి గ్రామం రంగనాయకుల కాలనీకి, చెందిన ఎస్లావత్ లక్ష్మి,అనారోగ్య కారణాలవల్ల అపోలో డిఆర్డిఎల్ హాస్పటల్లో చికిత్స పొందింది.అయితే స్థానిక శాసన సభ్యురాలు సబిత రెడ్డి సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకోగా ఈరోజు ఆమెకు సీఎంర్ఫ్ చెక్కు నిధులు ,ఆమె భర్త ఇస్లావత్ శ్రీనివాస్ కు బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్ మరియు బడంగ్పేట్ కి చెందిన ఇతర మాజీ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.



# పొరపాట్లు లేకుండా జనగనన సజావుగా జరగాలి

## శిక్షణ ఆఫీసర్ గా తహసీల్దార్ సురేష్ కుమార్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) ఏప్రిల్ 28**

మండల కేంద్రం లోని హైస్కూల్ లో ఏర్పాటు చేసిన జన గణన 2027 మొదటి దశా శిక్షణ తరగతులకు ఎన్యుమరేటర్లకు మరియుసూపర్ వైజర్లకు శిక్షణ అధికారిగా తహసీల్దార్ సురేష్ కుమార్ వ్యవహారించారు జనగనన మొత్తం డిజిటల్ పద్దతిలో జరుగుతుందని హెచ్ఎల్ఓ (నూూ )యాప్ పై పూర్తిగా అవగాహనా కలిగిఉండాలన్నారు డిజిటల్ విధానంలో ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు ఈకార్యక్రమంలో, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ , ఆర్ఐ సంతోష్,సందీప్ రెడ్డి, స్వామి రెడ్డి, ట్రైనర్లు తదితరులు పాలుగోన్నారు.



# ధాన్యం కొనుగోల్లు వేగవంతం చేయాలి

## అదనపు కలెక్టర్ బి శ్రీనివాస్ రెడ్డి

**హుస్నాబాద్, ఏప్రిల్ 28 (ప్రజాతీర్పు)**

చిగురుమామిడి మండలంలో వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కరీంనగర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులకు, కొనుగోలు కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం సుందరగిరి,బొమ్మనపల్లి, చిగురుమామిడి గ్రామాలలోని ఐకేపీ ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలును వేగవంతం చెయ్యాలని,కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను,కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లను ఆదేశించారు.ఈ వారి వెంట తహశీల్దార్ ఎం రమేష్. రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజు ఆయా గ్రామాల సర్పంచులు,రైతులు తదితరులున్నారు.

# అనిల్ అంబానీ మరో 3 వేల కోట్ల ఆస్తుల జప్తు

అనిల్ అంబానీకి చెందిన మరో రూ.3 వేల కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడీ). బ్యాంకులను మోసం చేసిన కేసులో మనీలాండరింగ్ జరిగిందంటూ ఆరోపిస్తున్న ఈడీ.. తాజాగా అనిల్ అంబానీ, ఆయన కుమారుడు అన్మోల్ అంబానీలకు చెందిన రూ.3,034 కోట్ల విలువైన ఖాందాల ఫామ్హౌస్ను జప్తు చేసినట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఆస్తులను దుర్వినియోగం చేయడంతోపాటు బ్యాంకులను మోసం చేసిన కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్కు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేస్తున్నది. దీనిపై అడాగ్ ప్రతినిధి మాట్లాడుతూ..అనిల్ అంబానీ తల్లి కోకిలాబెన్ డీ అంబానీ ఆస్తులను కూడా జప్తు చేశారని పేర్కొన్నారు.

# వేసవి సెలవుల్లో ఊరికి వెళ్తున్నారా.. అయితే జర భద్రం..

## పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్.,ఐపీఎస్

**సిద్దిపేట ఏప్రిల్ 28 (ప్రజా తీర్పు ప్రతినిధి ):**



చోరీలు, పిల్లలు వేసవిలో ప్రమాదకరమైన ప్రాంతాలలో ఈత అలవాటు పై ప్రజలకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్.,ఐపీఎస్ కీలక సూచనలు వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు లేదా విహారయాత్రలకు వెళ్తున్న సందర్భంలో, అలాగే ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ ఒక ప్రకటనలో ప్రజలను అప్రమత్తం చేశారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో చాలామంది కుటుంబాలతో కలిసి బయటకు వెళు ్తుండగా, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇంటికి తాళం వేసి వెళ్లే వారు నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంటి చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంచవచ్చని తెలిపారు. నమ్మకమైన పొరుగువారికి లేదా బంధువులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయడం, ఇంటి వద్ద అప్పుడప్పుడు చూడమని అభ్యర్థించడం మంచిదని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినపుడు వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల పట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సిపి సూచించారు. పిల్లలు సరదా కోసం చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లి ఈత కొట్టే ప్రమాదకర అలవాటు ఉన్నందున, తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తెలియని లోతైన నీటిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలను ఒంటరిగా నీటి వనరుల వద్దకు పంపకూడదని, ఎల్లప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండేలా చూడాలని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటుందని, అయినప్పటికీ ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి పై సూచనలు పాటిస్తే చోరీలు, ప్రమాదాలను నివారించవచు.



# సంతోషిమా నగర్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మర్రి రాజశేఖర్ రెడ్డి శ్రీకారం

**(వినోద్, ప్రజాతీర్పు మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి ) ఏప్రిల్ 28**

మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి నియోజకవర్గ మౌలాలి మున్సిపాలిటీ పరిధిలోని సంతోషిమా నగర్లో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నియోజకవర్గ శాసనసభ్యుడు మర్రి రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రాంత ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. సంతోషిమా నగర్లో సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానికులకు రాకపోకలు సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలాలి డివిజన్ మాజీ కార్పొరేటర్ అమీనుద్దీన్, జేఏసీ వెంకన్న, ఏకే మురుగేష్, మండల్ చిన్న యాదవ్, డివిజన్ అధ్యక్షుడు తులసి సురేష్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గుప్తా, నాయకులు బద్దం హేమంత్ రెడ్డి, షేక్ ఫరీద్, ఉస్మాన్, భాగ్యానంద్, కరీం, అంజయ్య, ప్రభాకర్ రెడ్డి, గుత్తి రామచందర్, వెంకటేష్ చారి, నర్సింగ్ రావు, మహేష్ గౌడ్, నరసింహ, శ్రీనివాస్, సురేష్, మణిరత్నం, సాయిసాగర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# మే 3 న జరుగనున్న నీట్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు మేడ్చల్ జిల్లా) ఏప్రిల్ 28**



మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నీట్ పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా నుండి 3 వేల 468 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టరు సూచించారు. అభ్యర్థులు చివరి నిమిషలో కంగారు పడకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభర్థులకు కరెంట్, మంచినీరు అందులో ఉంచాలని, కేంద్రాల వద్ద పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య అధికారులు మెడికల్ కిట్, అంబులెన్సులు అందుబాటులోఉంచాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్ వంటి వాటిని అందుబాటులో ఉండేలా డిడబ్ల్యూఓ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రావతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలి

**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఏప్రిల్28 (ప్రజాతీర్పు)**



హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటను అమ్ముకున్న రైతులకు సకాలంలో చెల్లింపులు జరగకపో వడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం బి.ఆర్.ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.దాదాపు నెల రోజులుగా రైతులకు డబ్బులు చెల్లించకపోవడం వల్ల వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మార్కెట్ యార్డ్లో సుమారు 680 మంది రైతుల నుండి 27 వేల క్వింటాళ్ల వరకు మొక్కజొన్న కొనుగోలు చేసి, దాదాపు రూ.6.5 కోట్లు బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, ఎకరానికి 26 క్వింటాళ్లకే పరిమితి విధించడం సరైంది కాదని, వాస్తవానికి దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు. రైతులకు నష్టం కలిగించే ఇలాంటి ఆంక్షలను తొలగించి, ఎలాంటి షరతులు లేకుండా మొక్కజొన్న కొనుగోలు చేయాలని కోరారు. అలాగే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పర్యవేక్షణలో నాయకులు దొంతరబోయిన శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఊహించని సంక్షోభం ముంచుకొస్తోంది..!

## వణుకుపుట్టిస్తున్న కియోసాకి కామెంట్స్

రాబర్ట్ కియోసాకి 2026-27లో పెద్ద ఆర్థిక సంక్షోభం రాబోతుందని హెచ్చరించారు. ఈ పతనాన్ని కొందరు అవకాశంగా మార్చుకుని లాభపడితే, కొందరు నష్టపోతారని ఆయన అన్నారు. బంగారం, వెండి, రియల్ ఎస్టేట్లో పెట్టుబడులు సూచించారు. భారతీయ ఇన్వెస్టర్లు రిస్క్ అర్థం చేసుకుని, ప్రణాళికతో విభిన్న మార్గాల్లో పెట్టుబడులు పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లకు పరిచితమైన ఆర్థిక వేత్త, రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 2026-27 మధ్యకాలంలో ప్రపంచం మరో పెద్ద ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశముందని హెచ్చరించారు. ఎక్స్ వేదికగా స్పందించిన కియోసాకి, రాబోయే మార్కెట్ పతనంలో ప్రజలు రెండు వర్గాలుగా విడిపోతారని అన్నారు. ఒక వర్గం ఆర్థికంగా నష్టపోతే, మరో వర్గం అదే పరిస్థితిని అవకాశంగా మార్చుకుని లాభపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. గత అనుభవాలను ప్రస్తావిస్తూ 1987, 2000, 2008 వంటి సంక్షోభాల్లో తాను నష్టపోకుండా, మరింత సంపదను కూడబెట్టినట్లు తెలిపారు. సంక్షోభాల సమయంలోనే అసలు అవకాశాలు దాగి ఉంటాయి అని ఆయన పేర్కొన్నారు. మార్కెట్లు కుప్పకూలినప్పుడు మంచి ఆస్తులు తక్కువ ధరలకు లభిస్తాయని, అప్పుడు పెట్టుబడులు పెట్టే వారు భవిష్యత్తులో లాభపడతారని వివరించారు. ప్రత్యేకంగా గోల్డ్, సిల్వర్, అలాగే రియల్ ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులు దీర్ఘకాలంలో




లాభదాయకంగా మారవచ్చని ఆయన సూచించారు. అయితే సరైన ప్రణాళిక లేకుండా పెట్టుబడులు పెట్టడం ప్రమాదకరమని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతీయ పెట్టుబడిదారుల విషయంలో గ్లోబల్ మార్కెట్ల ప్రభావం దేశీయ ఆర్థిక వ్యవస్థపై పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అందువల్ల మార్కెట్లోకి వెళ్లే ముందు రిస్క్ను అర్థం చేసుకుని, విభిన్న పెట్టుబడి మార్గాలను ఎంచుకోవడం అవసరమని సూచిస్తున్నారు. మొత్తానికి రాబోయే కాలంలో ఆర్థిక అస్థిరతలు పెరిగే అవకాశాల మధ్య, పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉండాలని, భయపడకుండా కానీ అజాగ్రత్తగా కూడా కాకుండా ముందుకు సాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ను కలిసిన కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) ఏప్రిల్, 28**

తెలంగాణ జేఏసీ చైర్మన్ ఢ తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సమితి ఆ సమితి సభ్యులతో కలిసి వచ్చిన చైర్మన్ చెరుకు నాగభూషణం మాట్లాడుత్న.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి గత మూడు సంవత్సరాలు అవుతున్నా.. ఎన్నికల ముందు వికలాంగులకు ఇచ్చిన మేనిఫెస్టో లోని అంశాలను హామీలను అమలు చేయడం లేదంటూ.. ఇకనైనా వెంటనే అమలు చేయాలని విజ్ఞాపన పత్రాన్ని అందజేయడం జరిగింది. ఇట్టి విషయంపై కోదండరాం సార్ స్పందిస్తూ వికలాంగులకు ఇచ్చిన కాంగ్రెస్ మేనిఫెస్టో అన్ని అంశాల పై సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలంటూ ముఖ్యమంత్రికి తన మొట్టమొదటి ఉత్తరం రాస్తానన్న కోదండరాం సార్ అందుకు కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి సభ్యులు సంతోషం వ్యక్తపరుస్తూ.. గవర్నర్ ఆమోదంతో శాసనమండలికి మరోసారి ఎమ్మెల్సీగా ఎన్నికై దివ్యాంగుల బాధలు తీరుస్తానంటున్నా



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సార్ కి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలియజేసి, హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు చైర్మన్ నాగభూషణంతోపాటు, సాధన సమితి నాయకులు బిజెపి సెల్ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల జేఏసీ నాయకుడు మొక్క ఉపేందర్, డిజేబుల్ రైట్ యాక్టివిటీ వేణు గౌడ్, మరుగుజ్జు సంఘం అధ్యక్షులు బుగ్గ మల్లేష్, శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, ఎలిమినేటి మల్లారెడ్డి తదితర దివ్యాంగుల నాయకులు పాల్గొన్నారు

# దూబే, ఫెరీరా విధ్వంసం.. పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్..!

పంతొమ్మిదో సీజన్‌లో భారీ లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తూ అజేయంగా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్‌కు షాకిచ్చింది రాజస్థాన్ రాయల్స్. ఆరు విజయాలతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతున్న పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపించింది. 223 లక్ష్య ఛేదనలో యశస్వీ జైస్వాల్(51), వైభవ్ సూర్యవంశీ(43)లు మెరుపు ఆరంభమివ్వగా.. డొనొవాన్ ఫెరీరా(52 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ శుభం దూబే(31 నాటౌట్)లు డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఆరో విజయంతో మూడో స్థానానికి దూసుకెళ్లింది రాజస్థాన్. ఐపీఎల్-19లో పంజాబ్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తున్న పంజాబ్‌కు సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ ఊహించని పంచ్ ఇచ్చింది. ముల్లన్‌పూర్‌లో నిర్దేశించిన 223 పరుగుల ఛేదనను రాజస్థాన్ రాయల్స్ ధాటిగా మొదలెట్టింది. తొలి ఓవర్లోనే అర్ష్‌దీప్ సింగ్‌కు చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(43) 6, 4, 4 బాదాడు. అనంతరం యాన్సెన్, ఫెర్గూసన్ ఓవర్లోనూ వైభవ్ విధ్వంసంతో 20 బంతుల్లోనే 51 పరుగులు చేసింది రాజస్థాన్. అర్ధ శతకానికి చేరువైన వైభవ్ ఆ తర్వాతి బంతికే అయ్యర్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్()ను చాహల్ ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు. కాసేపు షాట్లతో అలరించిన యశస్వీ జైస్వాల్()ను సైతం వెనక్కి పంపిన చాహల్.. కెప్టెన్ రియాన్ పరాగ్()ను పెవిలియన్ చేర్చాడు. చాహల్ వేసిన 14వ ఓవర్లో తొలి రెండు బంతుల్ని 6, 4 గా మలిచిన పరాగ్ చివరి బంతికి బౌటయ్యాడు.



**దూబే, ఫెరీరా ధనాధన్**

వెంట వెంటనే వికెట్లు పడినా ఇంప్యాక్ట్ సబ్‌గా వచ్చిన శుభమ్ దూబే(31 నాటౌట్) డొనొవాన్ ఫెరారా(52 నాటౌట్)లు అదరలేదు. గెలుపు బాధ్యత తీసుకున్న ఈ జోడీ పంజాబ్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. అర్ష్‌దీప్ వేసిన 18వ ఓవర్లో ఫెరీరా 6, 4.. చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపగా మ్యాచ్ రాజస్థాన్ వైపు మళ్లింది. 12 బంతుల్లో 18 రన్స్ అవసరమైన వేళ.. ఫెర్గూసన్ బౌలింగ్‌లో 4, 6 బాదిన ఫెరీరా పంజాబ్ ఓటమిని ఖాయం చేశాడు. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ఫెరీరా.. రాజస్థాన్‌కు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.



## 'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో ఐటెం సాంగ్

సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోళీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.



## కాజల్ కొత్త మూవీ'ది ఇండియా స్టోరీ' రిలీజ్ డేట్ ఫిక్స్... రైతుల సమస్యలపై బలమైన సందేశం..

సామాజిక అంశాలను ప్రధానంగా తీసుకుని రూపొందిన మరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ది ఇండియా స్టోరీ అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ నిర్మించగా, చెట్టన్ డీకే దర్శకత్వం వహించారు. సామాజిక అంశాలను ప్రధానంగా తీసుకుని రూపొందిన మరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ది ఇండియా స్టోరీ అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ నిర్మించగా, చెట్టన్ డీకే దర్శకత్వం వహించారు. జూలై 24న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం రైతులు వ్యవసాయంలో ఉపయోగించే పురుగుమందుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను కేంద్రంగా తీసుకుని రూపొందింది.



# డిజిటల్ రసీదు విధానం ప్రారంభం

**(రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజా తీర్పు నారకట్ల మధు ) ఏప్రిల్ 28**

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కొత్త సేవలు వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా: శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు సమర్పించే బంగారం, వెండి మరియు ఇతర విలువైన వస్తువులకు సంబంధించి డిజిటల్ రసీదు విధానాన్ని ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గౌరవ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి శ్రీ హనుమంతరావు గారు భీమేశ్వర సదన్ వసతి గృహంలో అధికారికంగా ప్రారంభించారు. ఈ నూతన డిజిటల్ విధానం ద్వారా భక్తులు సమర్పించే వస్తువులకు పూర్తి వివరాలతో రసీదు జారీ చేయబడుతుంది. అందులో టికెట్ నంబర్, భక్తుని పేరు, మొబైల్ నెంబర్, చిరునామా, తేదీ, వస్తువు పేరు, వస్తువు రకం, వస్తువుల సంఖ్య, తూకం (కిలోగ్రాములు/గ్రాములు/మిశ్రమ గ్రాములు), అంచనా విలువ వంటి వివరాలు నమోదు చేయబడతాయి . అదేవిధంగా భక్తులకు "ఐవజశీవవ జశీజూఎ" మరియు కార్యాలయ వినియోగం కోసం "హటటఱఎవ జశీజూఎ" అందజేయబడుతుంది. ఈ విధానం ద్వారా భవిష్యత్తులో సమర్పణల ట్రాకింగ్, ధృవీకరణ సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి గారు, ఆలయ సిబ్బంది, అర్చకులు మరియు వేద పండితులు పాల్గొన్నారు. ఈ నూతన సేవతో భక్తులకు పారదర్శకత పెరుగుతుందని, సేవలు మరింత మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## జిల్లా లైన్స్ క్లబ్ వాయిస్ గవర్నర్ 2 గా ఎన్నికైన గుడిపూరి వెంకటేశ్వర రావు కు ఆర్థిక శుభాకాంక్షలు

**(మదు,ప్రజాతీర్పు సూర్యాపేట)ఏప్రిల్ /28**

సూర్యాపేట పట్టణ కేంద్రం నందు విద్యానగర్ లో గుడిపూరి వెంకటేశ్వర రావు తన నివాసంలో ఇటీవల కాలంలో లైన్స్ క్లబ్ 320ఇ జిల్లా వాయిస్ గవర్నర్ 2 గా ఖమ్మం,నల్గొండ,సూర్యాపేట మూడు జిల్లాలకు గాను ఎన్నిక సందర్బంగా పూల మాల శాలువాతో సత్కారించి వారికి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేసి భౌవిషత్ లో ఇంకా ఎన్నో పదవులు పొందాలని ఆకాంక్ష తెలిపిన తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ మరియు చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జాటోత్ డేవిడ్ రాజు, గుగులోత్ బాలాజీ నాయక్,ధరవత్ నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సమ్మర్ క్యాంప్‌కు స్పోర్ట్స్ మెటీరియల్ అందజేసిన సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) ఏప్రిల్ 28:**

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం వార్డు అన్నోజిగూడలో నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌కు అవసరమైన క్రీడా సామగ్రిని రేవంత్ టీం సభ్యుడు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోచారం సీఐ కనకయ్య గౌడ్, షీ టీం సీఐ అంజయ్య, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్ కోసం క్రీడా సామగ్రిని అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ క్యాంప్ ద్వారా విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనురాధ టీచర్, పీఈటీ విజయ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్వార్టర్స్‌కు సబలెంకా, సిన్నర్



ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న మ్యాడ్రిడ్ ఓపెన్‌లో టాప్ టెన్నిస్ ప్లేయర్లు అరీనా సబలెంకా, యానిక్ సిన్నర్ క్వార్టర్స్ చేరారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ వన్ సబలెంకా.. 6-7 (1/7), 6-3, 6-2తో నవొమి ఒసాకా (జపాన్)ను ఓడించింది. కానీ మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా).. 4-6, 6-1, 5-7 (5/7)తో నొస్కొవ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడింది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా ఓపెన్ గెలిచిన ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) సైతం.. 6-7 (8/10), 4-6తో పొటపొవ (ఆస్ట్రియా) జోరుకు తలవంచింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ).. 6-2, 7-5తో కామెరూన్ నూరీ (బ్రిటన్)పై అవలీల విజయం సాధించి క్వార్టర్స్ చేరగా రెండో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ).. 6-3, 7-6 (7/2)తో టెరెన్స్ అట్మనె (ఫ్రాన్స్) పై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు ప్రవేశించాడు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020